
పల్లె పండగలో రూ. 1.05 కోట్ల పనులు ప్రారంభం

నెల్లూరు(జడ్పీ),న్యూస్‌టుడే: జోరు వర్షంలోనూ పల్లె పండగ కొనసాగుతోంది. కార్యక్రమంలో భాగంగా రెండో రోజు మంగళవారం నెల్లూరు గ్రామీణం, కందుకూరు, ఉదయగిరి నియోజకవర్గ పరిధిలోని పలు పల్లెల్లో సీసీ రోడ్ల పనులు ప్రారంభించారు. మొత్తం 17 పనులకు శ్రీకారం చుట్టారు. సుమారు రూ. 1.05 కోట్ల విలువైన సీసీ రోడ్డు పనులను పంచాయతీరాజ్‌శాఖ ఆధ్వర్యంలో మొదలుపెట్టారు. ఈ నెల 20వ తేదీలోపు మిగిలినవి ప్రారంభిస్తామని ఎస్ఈ అశోక్‌కుమార్ తెలిపారు.

రుణాల మంజూరుకు దరఖాస్తుల ఆహ్వానం

నెల్లూరు(విద్య), న్యూస్‌టుడే: జిల్లాలోని విభిన్న ప్రతిభావంతులు, జాతీయ దివ్యాంగుల ఆర్థికాభివృద్ధి సంస్థ, విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల సహాయ సంస్థ ఆధ్వర్యంలో స్వయం ఉపాధి కింద వివిధ పథకాలకు రుణాల మంజూరు చేయనున్నారు. ఇందుకు అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానించినట్లు ఆ శాఖ జిల్లా మేనేజరు వినయ్‌కుమార్ ప్రకటనలో పేర్కొన్నారు. నవంబరు 1వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవచ్చని.. వివరాలకు 08612329581 నంబరును సంప్రదించాలని తెలిపారు.

జిల్లా ఇన్‌ఛార్జి మంత్రిగా ఎన్‌ఎండీ ఫరూక్



నెల్లూరు(కలెక్టరేట్): రాష్ట్ర ప్రభుత్వం జిల్లా ఇన్‌ఛార్జి మంత్రులను నియమిస్తూ మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. జిల్లా ఇన్‌ఛార్జి మంత్రిగా మైనార్టీ, న్యాయశాఖ మంత్రి ఎన్‌ఎండీ ఫరూక్‌ను నియమించారు. జిల్లాకు చెందిన మున్సిపల్‌శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ కాకినాడ, దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ప్రకాశం జిల్లాలకు ఇన్‌ఛార్జి మంత్రులుగా నియమితులయ్యారు.

జిల్లాకు.. రెడ్ అలర్ట్!



ఈనాడు, నెల్లూరు: కలెక్టరేట్, నేరవార్తలు, విద్య న్యూస్‌టుడే

దక్షిణ బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం తీవ్ర వాయుగుండంగా బలపడుతున్న నేపథ్యంలో వాతావరణశాఖ జిల్లాకు రెడ్ అలర్ట్ ప్రకటించింది. గంటకు 35 నుంచి 45 కి.మీ. వేగంతో ఈదురు గాలులు వీచే అవకాశం ఉందని స్పష్టం చేసింది. రానున్న 24 గంటల్లో భారీ వర్షాలతో పాటు ఫ్లాష్ ఫ్లడ్‌కు అవకాశం ఉందని హెచ్చరించింది. దీంతో ఇప్పటికే అప్రమత్తమైన యంత్రాంగం.. వర్ష ప్రభావ ప్రాంతాలపై ప్రత్యేక దృష్టిసారించింది. అధికారులకు సెలవులు రద్దు చేయడంతో పాటు జిల్లా, డివిజన్ స్థాయిలో ప్రత్యేక సహాయ కేంద్రాలను ఏర్పాటు చేసింది. క్షేత్రస్థాయిలో ఏర్పడిన సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించే ప్రయత్నం చేస్తోంది.. పలు లోతట్టు ప్రాంతాల్లోని ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించి.. వసతి, ఆహారం ఏర్పాటు చేసింది. పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్న కలెక్టర్ ఆనంద్.. భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున మరో 72 గంటలు అధికారులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అవసరమైతే తప్ప.. బయటకు రావద్దని సూచించారు.

కట్టలు భద్రం

పెన్నా పరీవాహక ప్రాంతంలోని చెరువులు, పొర్లుకట్టలకు గండ్లు పడకుండా అధికారులు ముందస్తు చర్యలు తీసుకుంటున్నారు. వర్షపు నీటి ప్రవాహానికి.. పాత పెన్నా వంతెన దగ్గర గండి పడటాన్ని గుర్తించి.. వెనువెంటనే మరమ్మతులు చేయించారు. ఇతర ప్రాంతాల అధికారులనూ అప్రమత్తం చేశారు. పోలీసు, ఇరిగేషన్, ఆర్అండ్‌బీ శాఖల సమన్వయంతో చర్యలు తీసుకుంటున్నారు.



ప్రజలతో మాట్లాడుతున్న కలెక్టర్.. అంతరచిత్రంలో వంతెనకు మరమ్మతులు



నెల్లూరు : మంగళవారం రాత్రి నర్తకి సెంటర్ వద్ద జోరువాన

గజ ఈతగాళ్లు సిద్ధం

సంగం : వరద ప్రభావిత గ్రామాలైన వీర్లగుడిపాడు, కోలగట్ల గ్రామాల నుంచి ప్రజలను వెంటనే తరలించేందుకు వీలుగా రెవెన్యూ, మత్స్యశాఖల సహకారంతో రెండు పడవలు, ఏడుగురు గజ ఈతగాళ్లను మంగళవారం సిద్ధం చేశారు. ఆత్మకూరు డీఎస్పీ వేణుగోపాల్, సంగం సీఐ వేమారెడ్డి, ఎస్సై రాజేశ్ చెర్లోవంగల్లు వద్ద కలుజును పరిశీలించారు. వరద ప్రవాహం వస్తే.. దాన్ని ఎవరూ దాటకుండా బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. తహసీల్దారు సోమ్లానాయక్ అన్నారెడ్డిపాళెం గిరిజన కాలనీకి వెళ్లి ప్రజలతో మాట్లాడారు. భారీ వర్షాలు వచ్చే అవకాశాలు ఉన్నాయని, పునరావాస శిబిరాలకు వచ్చేందుకు సిద్ధంగా ఉండాలని సూచించారు.

సోమశిల వద్ద...

అనంతసాగరం : అల్పపీడన ప్రభావంతో విస్తారంగా వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో.. ఎగువ ప్రాంతాల నుంచి వచ్చే వరద ప్రవాహంపై అధికారులు అప్రమత్తంగా ఉండాలని సోమశిల ప్రాజెక్టు ఎస్ఈ వెంకటరమణారెడ్డి సూచించారు. మంగళవారం ఆయన జలాశయాన్ని సందర్శించారు. ఆప్రాన్ అభివృద్ధి పనులు, కంట్రోల్ రూమ్, జలాశయం క్రస్ట్‌గేట్లను పరిశీలించి.. ఇతర వివరాలను తెలుసుకున్నారు. తగు సూచనలు చేశారు. ఈఈ దశరథరామిరెడ్డి, డీఈఈ రవీంద్ర ప్రసాద్, జేఈఈలు రామ్మోహన్, నిఖిల్, ప్రాజెక్టు సిబ్బంది ఉన్నారు.



పనులు పరిశీలిస్తున్న ప్రాజెక్టు ఎస్ఈ వెంకట రమణారెడ్డి

జలదంకిలో అత్యధికం

మంగళవారం వేకువజాము నుంచి రాత్రి 8 గంటల వరకు జిల్లాలో సగటున 138 మి.మి. వర్షపాతం నమోదైంది. అత్యధికంగా జలదంకిలో 235.4 మి.మి. విడవలూరులో 206 మి.మి., అల్లూరు 197.6 మి.మి., నెల్లూరు అర్బన్‌లో 179.6 మి.మి. నమోదైంది. ఇక్కడ తెల్లవారుజామున 91.6 మి.మి. కురవగా.. సాయంత్రం 4 నుంచి రాత్రి 8 గంటల మధ్య 52.2 మి.మి. పడింది. మొత్తంగా 38 మండలాల్లో కేవలం ఆరింటిలోనే 100 మి.మి. కంటే తక్కువ వర్షపాతం కురిసింది.

మండలం	వర్షపాతం (మి.మీ)
జలదంకి	235.4
విడవలూరు	206
అల్లూరు	197.6
కావలి	187.2
బోగోలు	182.4
కొడవలూరు	181.8
కందుకూరు	180.6
నెల్లూరు అర్బన్	179.6
దగదర్తి	169.2
కోవూరు	165
నెల్లూరు రూరల్	161.8
ఇందుకూరుపేట	158.4
వెంకటాచలం	155
బుచ్చి	153.6
సంగం	149.4
ముత్తుకూరు	144
ఉలవపాడు	142.4
తోటపల్లిగూడూరు	138.8
గుడ్లూరు	134.2
మనుబోలు	133.4
అనంతసాగరం	130
కలిగిరి	129.6
పొదలకూరు	128.8
వలేటివారిపాలెం	123.6
వింజమూరు	120.2
కలువాయి	119.8
చేజర్ల	117.2
సైదాపురం	115.6
లింగసముద్రం	112.6
ఏ.ఎస్.పేట	106.6
ఆత్మకూరు	105
మర్రిపాడు	102
కొండాపురం	97.6
ఉదయగిరి	90.4
రాపూరు	86
దుత్తలూరు	85.4
వరికుంటపాడు	60.6
సీతారామపురం	51

నేడూ.. విద్యా సంస్థలకు సెలవు

భారీ వర్షాల దృష్ట్యా బుధవారం కూడా పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, జూనియర్, డిగ్రీ కళాశాలలకు కలెక్టర్ సెలవు ప్రకటించారు. ఇంటర్మీడియెట్ విద్యార్థులకు 16వ తేదీ జరగనున్న త్రైమాసిక (క్వార్టర్లీ) పరీక్షను వాయిదా వేసినట్లు ఆర్ఐవో తెలిపారు. ఈ విషయాన్ని ప్రిన్సిపళ్లు, విద్యార్థులు గుర్తించాలని కోరారు.

వచ్చింది.. వచ్చినట్లే..



కోలగట్ల వద్ద పెన్నానదిలో వరద ప్రవాహం

సంగం : సంగం బ్యారేజీ వద్ద వరద ప్రవాహం నిలవకుండా.. తెలుగుగంగ, జలవనరులశాఖ అధికారులు చర్యలు చేపట్టారు. మంగళవారం ఉదయం ఆరు గంటలకు ఆనకట్ట వద్ద 136.64 మి.మీ. వర్షపాతం నమోదైంది. పెన్నా నుంచి 2,950 క్యూసెక్కుల వరద వస్తుండగా- బ్యారేజీ 12 గేట్ల ద్వారా 2,800 క్యూసెక్కులను దిగువకు తరలిస్తున్నారు. కనిగిరి జలాశయం ప్రధాన కాలువకు 100, నెల్లూరు చెరువుకు 40, నెల్లూరు తాగునీటికి 40 క్యూసెక్కుల చొప్పున తరలించారు. సంగం బ్యారేజీ వద్దకు వచ్చిన ప్రవాహాన్ని.. వచ్చినట్లే దిగువకు విడుదల చేయాలని ఉన్నతాధికారులు ఆదేశించినట్లు తెలుగుగంగ డీఈఈ విజయరామిరెడ్డి తెలిపారు.

విపత్కర పరిస్థితుల్లో..

ఫోన్ నంబర్లు
112, 94407 96370
పోలీసు కంట్రోల్ రూమ్ వాట్సాప్ నంబరు: 93929 03413

72 హెక్టార్లలో పంట నష్టం



పడమటికంభంపాడులో దెబ్బతిన్న వరిపంట

రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు జిల్లాలో వ్యవసాయ, ఉద్యాన పంటలకు నష్టం వాటిల్లింది. అధికారుల ప్రాథమిక సమాచారం ప్రకారం.. జిల్లాలో 72 హెక్టార్ల వరి పంట దెబ్బతింది. చేజర్ల, విడవలూరు మండలాల్లో కోతకు వచ్చిన వరి నీటిపాలు కావడంతో అన్నదాతలు ఆవేదన చెందుతున్నారు. దీంతో పాటు పది హెక్టార్లలో ఉద్యాన పంటలకు నష్టం వాటిల్లింది.

లోతట్టు వాసులకు.. పునరావాసం

ఉలవపాడు పరిధిలోని 350 కుటుంబాలను, అనంతసాగరం మండలం పడమటి కంభంపాడు, ఆత్మకూరు పరిధిలోని బండారుపల్లి, అప్పారావుపాళెం, కరటంపాడు ప్రాంతాల్లోని 45 కుటుంబాలకు చెందిన 160 మందిని పునరావాస కేంద్రాలకు తరలించారు. జిల్లా విపత్తు నిర్వహణ ప్రణాళికను అనుసరించి కంటింజెంట్ ప్లాన్, చెక్ లిస్టు తయారు చేసుకోవాలని, మండల కేంద్రాల్లో ప్రత్యామ్నాయ విద్యుత్తు, సమాచార, రేడియో కనెక్టివిటీలకు అంతరాయం లేకుండా ముందస్తు ఏర్పాట్లు చేసుకోవాలని ఎస్పీ కృష్ణకాంత్ ఆదేశించారు.



ప్రజలకు సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్న పోలీసులు





ముసురులో నెల్లూరు నగరం

భక్తి ముసుగులో.. రూ. 50 లక్షలకు టోకరా!

కావలికి చెందిన ఆ వ్యక్తి స్వామీజీ అవతారమెత్తాడు.. ఆశ్రమం పెట్టాడు.. ప్రవచనాలు, జాతకాల పేరుతో గుర్తింపు పొందాడు. సమస్యలకు పూజల పేరుతో నమ్మకం సంపాదించాడు. అవసరాలంటూ రూ. 50 లక్షల వరకు అప్పులు చేసి.. గుట్టు చప్పుడు కాకుండా పది రోజుల కిందట మాయమయ్యాడు.. ఆశ్రమాన్ని ఖాళీ చేస్తుండగా.. ప్రశ్నించిన మహిళపై ఆయన అనుచరులు దాడికి దిగారు. దానిపై ఫిర్యాదు అందుకున్న పోలీసులు రంగంలోకి దిగడంతో.. వ్యవహారం రట్టయింది.

కావలి, న్యూస్‌టుడే : తుమ్మలపెంట పంచాయతీ పూలదొరువు గ్రామానికి అయిదేళ్ల కిందట దాసరి పవన్‌కుమార్ వెళ్లి.. శ్రీనిలయం పేరుతో ఆశ్రమం ఏర్పాటు చేశారు. కుటుంబ, ఆరోగ్యపరమైన సమస్యలు ఉంటే.. తాను పూజలు చేసి నయం చేస్తానని ప్రచారం చేశాడు. ఏళ్లుగా ఉండటంతో గ్రామస్థులకు నమ్మకం కలిగింది. ఆయన మాటలకు విలువ పెరిగింది. దాన్ని ఆసరాగా తీసుకుని.. వివిధ అవసరాల పేరుతో భారీగా నగదు అప్పుగా తీసుకున్నాడు. పూలదొరువు, దూదేకులపాలెం గ్రామస్థుల నుంచి రూ. 50 లక్షల వరకు తీసుకున్నట్లు బాధితులు చెబుతున్నారు. కాగితంపై రాసివ్వాలంటే.. దేవుడిపై నమ్మకం లేదా అని చెప్పి తప్పించుకుంటున్నాడని, ఎన్ని రోజులైనా ఇవ్వకపోవడంతో గట్టిగా అడిగితే.. అనుచరులతో బెదిరిస్తున్నారని వాపోయారు. ఆశ్రమం ముసుగులో అనైతిక వ్యవహారాలకు తెరలేపారని ఆరోపిస్తున్నారు.

ఇలా గుట్టురట్టు

ఆశ్రమంలోని వస్తువులను అనుచరులు తీసుకువెళుతుండగా.. చుట్టుపక్కలవారు గమనించి.. ప్రశ్నించగా.. ఖాళీ చేస్తున్నట్లు తెలిసింది. దాంతో అప్పులు ఇచ్చిన వారు వచ్చి నిలదీశారు. ఆ క్రమంలో షేక్ అఖానీ అనే మహిళపై వారు దాడి చేయగా.. ఆమె కావలి డీఎస్పీకి ఫిర్యాదు చేశారు. విషయం బయటకు పొక్కడంతో.. 20 మంది వరకు బాధితులు తాము నగదు ఇచ్చామంటూ పోలీసులను ఆశ్రయించారు.

విచారణ చేస్తున్నాం

ఓ బాధిత మహిళపై దాడి జరుగుతుందని తెలియగానే స్పందించాం. నిందితులను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నాం. కావలి గ్రామీణ సీఐకు ఈ వ్యవహారంపై ఆదేశాలిచ్చాం. – ఎం.శ్రీధర్, డీఎస్పీ, కావలి

ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంక్
ANDHRA PRAGATHI GRAMEENA BANK
COMMITTED TO RURAL DEVELOPMENT
A SCHEDULED GOVERNMENT BANK (Sponsored by CANARA BANK)
HEAD OFFICE : KADAPA (AP)

REGARDING IMPLEMENTATION OF PENSION IN REGIONAL RURAL BANK'S (RRBs)

As per the directions of the Department of Financial Services, Ministry of Finance, Government of India, Vide **LR. No. F.No. 8/4/2024-RRB Dated: 03.10.2024** all those employees who were in Bank's service on or before **31.03.2010** will be given the benefit of pension from **01.11.1993.**
Therefore through this public notice it is informed to all employees who were in the Bank's service on or before **31.03.2010** and are not currently drawing pay or pension, have been dismissed/deceased, have taken compulsory retirement/ resigned or their legal heirs to apply for pension along with necessary documents at any **Regional Office**, from where he/she is willing to draw pension. The last date for submission of application is **25.10.2024.**
Please note that application form and other related documents are available on Bank's website **(www.apgb.in)** under **Retirees Desk** section.
Date : 16/10/2024
Place : Kadapa
General Manager (PHRD)
Andhra Pragathi Grameena Bank,
Head Office : Kadapa





(c) eenadu

రూ.10 నాణేలు చెల్లుబాటు

నెల్లూరు(విద్య, నవాబుపేట): పది రూపాయల నాణేలు చెల్లుబాటు అవుతాయని వీటిపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలని కెనరాబ్యాంకు సర్కిల్ డిప్యూటీ జనరల్ మేనేజర్ జీవీఎన్ మూర్తి పేర్కొన్నారు. ఆర్బీఐ ఆదేశాల మేరకు నెల్లూరు కెనరా బ్యాంకులో మంగళవారం ప్రజలకు నాణేలపై అవగాహన కల్పించి కెనరాబ్యాంకు ప్రాంతీయ కార్యాలయం వద్ద మొబైల్ కాయిన్ వ్యాన్‌ను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ జిల్లాలో 52 శాఖల ద్వారా ఈమె ఖాతాదారులకు నాణేలు పంపిణీ చేయాలని తెలిపారు. ప్రాంతీయ కార్యాలయ అసిస్టెంట్ జనరల్ మేనేజర్ నాగరాజు మాట్లాడుతూ నాణేలపై ప్రజలకు అవగాహన కల్పించడమే కాకుండా పలు ప్రాంతాల్లో పోస్టర్లు అంటించామన్నారు. డివిజనల్ మేనేజర్ స్మృతి, సీనియర్ మేనేజర్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.



అవగాహన కార్యక్రమంలో కెనరా బ్యాంక్ సర్కిల్ డీజీఎం జీవీఎన్ మూర్తి

కలువాయి మత్స్యకార సంఘం పాలకవర్గం రద్దు

కలువాయి, న్యూస్‌టుడే: నిబంధనలు అతిక్రమించిన కలువాయి చెరువు మత్స్యకార సహకార సంఘం పాలకవర్గాన్ని రద్దు చేసినట్లు మంగళవారం జిల్లా మత్స్యశాఖ సంయుక్త సంచాలకులు నాగేశ్వరరావు పేర్కొన్నారు. ఆయన తెలిపిన వివరాల మేరకు... 2022 జులైలో నూతన పాలకవర్గం ఏర్పాటైంది. ఎన్నికైన సభ్యుల కార్యకలాపాలు సక్రమంగా నిర్వహించడం లేదని మూడు నెలల క్రితం కొందరు కలెక్టరుకు ఫిర్యాదు చేయడంతో సంబంధిత అధికారులు విచారణకు ఆదేశించారు. పాలక వర్గం సభ్యులతో పలువురిని విచారించగా కొంతమంది సభ్యుల సంతకాలు ఫోర్జరీ చేశారని సంఘం సర్వసభ్య సమావేశాలు సభ్యులకు తెలియకుండా చేశారని గుర్తించారు. సొసైటీకి సంబంధించిన రికార్డులివ్వాలని విచారణాధికారులు పాలకవర్గ సభ్యులను కోరారు. దీనిపై సదరు సంఘం అధ్యక్షుడు హైకోర్టును ఆశ్రయించారు. రెండు వారాల్లో విచారణ అధికారి దస్త్రాలివ్వాలని ఆదేశించింది. సంఘానికి సంబంధించిన కొన్ని రికార్డులు మాత్రమే అధికారికి అప్పగించి కీలక దస్త్రాలు ఇవ్వకుండా పాలకవర్గం న్యాయస్థాన ఉత్తర్వులను ఉల్లంఘించారు. సదరు విచారణాధికారి సూచనలతో కోర్టు ఆదేశాలు సక్రమంగా నిర్వహించకుండా ఉల్లఘించినందుకు పాలక వర్గాన్ని రద్దు చేస్తున్నట్లు అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. సంఘం ప్రత్యేకాధికారిగా సంజయ్ స్టీఫెన్‌ను నియమించినట్లు మత్స్యశాఖ జేడీ తెలిపారు.

నయన్.. ప్రతిభ అదిరెన్

రూబిక్స్ క్యూబ్‌లు పరిష్కరిస్తూ గిన్నిస్ రికార్డు

లక్ష్యంతో సాగితే.. వయసుతో పని లేకుండా ప్రతిభ చూపొచ్చని నిరూపించాడు. స్వయం కృషికి తల్లిదండ్రుల ప్రోత్సాహం తోడైంది. నిరంతరం సరికొత్త ఆలోచనలతో ముందుకు సాగుతూ ప్రత్యేకత చాటుకున్నాడు. తక్కువ సమయంలో రూబిక్స్ క్యూబ్‌లు పరిష్కరించడం నేర్చుకుని 15 ఏళ్ల వయసులో గిన్నిస్ రికార్డు సాధించాడు. నెల్లూరిగా నిలిచిన ఆ విద్యార్థి.. నెల్లూరుకు చెందిన **నయన్ మౌర్య.**

\- న్యూస్‌టుడే, నెల్లూరు(సాంస్కృతికం)



నెల్లూరు గ్రామీణం ధనలక్ష్మీపురానికి చెందిన ముప్పసాని శ్రీనివాస్, స్వప్నల కుమారుడు నయన్ మౌర్య. నగరంలో పదో తరగతి చదువుతున్నాడు. తల్లిదండ్రులు ఉద్యోగరీత్యా అమెరికాలో ఉంటూ 2020లో నెల్లూరుకు వచ్చి వస్త్ర దుకాణం నిర్వహిస్తున్నారు. పుట్టిన రోజు తండ్రి బహుమతిగా రూబిక్స్ క్యూబ్ ఇచ్చారు. దాన్ని సాధన చేస్తూ తల్లిదండ్రుల ప్రోత్సాహంతో రూబిక్స్ క్యూబ్‌ను పరిష్కరించి పలు పోటీల్లో బహుమతులు అందుకున్నాడు. అలా సాధన చేస్తూ తల్లిదండ్రులు ఇచ్చిన 20 రకాల క్యూబ్‌లను పరిష్కరించడంలో నైపుణ్యాన్ని సాధించాడు. ప్రతిభను మరింతగా మెరుగుపరుచుకునేందుకు క్యూబర్ అసోసియేషన్‌లో సభ్యుడిగా చేరి.. కొత్త విషయాలు తెలుసుకున్నాడు.


గిన్నిస్ రికార్డుతో తల్లిదండ్రులు, తమ్ముడితో నయన్ మౌర్య

రోబోటిక్ ఇంజినీరింగే లక్ష్యం

చదువుపైనా రోబోటిక్ అంటే ఎంతో ఇష్టం. రోబోటిక్ ఇంజినీరింగ్ చేయాలన్నదే లక్ష్యం. దేశసేవలో సైతం తన విజ్ఞానాన్ని వినియోగించాలన్నది కోరిక. - నయన్ మౌర్య

ఫుట్‌బాల్ క్రీడాకారుడిగా..

రూబిక్స్ క్యూబ్‌లు పరిష్కరించడంలో పేరుగాంచిన నయన్ మౌర్య ఫుట్‌బాల్ క్రీడాకారుడిగా రాణిస్తున్నాడు. పలు పోటీల్లో పాల్గొని బహుమతులు సొంతం చేసుకున్నాడు. అండర్-14 రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. అంతర్జాతీయ స్థాయి క్రీడాకారుడిగా పేరుతెచ్చుకోవాలనే లక్ష్యంతో శిక్షణ తీసుకుంటున్నాడు.

59 నిమిషాల్లో పరిష్కారం

సాధారణంగా రూబిక్స్ క్యూబ్‌ను పరిష్కరించేందుకు గణితంలోని అల్గారిథంలో 51 సూత్రాలను వినియోగిస్తారు. వీటన్నింటిని సాధన చేసి సరికొత్త విధానానికి మౌర్య శ్రీకారం చుట్టాడు. సైకిల్ తొక్కుతూ మోచేతులతో బ్యాలెన్స్ చేస్తూ కాలు కింద పెట్టకుండా ఒక్కో క్యూబ్‌ను పది నుంచి 12 సెకండ్లలో పూర్తిచేయడంలో పట్టు సాధించాడు. ఈ ఏడాది ఏప్రిల్‌లో చెన్నైలో జరిగిన పోటీల్లో గిన్నిస్ రికార్డు ప్రతినిధుల సమక్షంలో సైకిల్ తొక్కుతూ మోచేతులతో బ్యాలెన్సు చేస్తూ కాలు కింద పెట్టకుండా 271 రూబిక్స్ క్యూబ్‌లను 59 నిమిషాలలో పరిష్కరించి గిన్నిస్ రికార్డు సాధించాడు.


మాట్లాడుతున్న కలెక్టర్ ఆనంద్

అక్షరాస్యతతోనే అభివృద్ధి సాధ్యం: కలెక్టర్

నెల్లూరు(కలెక్టరేట్), న్యూస్‌టుడే: అక్షరాస్యతతోనే అన్ని రంగాల్లో అభివృద్ధి సాధ్యమని కలెక్టర్ ఓ.ఆనంద్ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించిన ఉల్లాస్ కార్యక్రమంపై మంగళవారం కలెక్టరేట్‌లో సమావేశాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ 15 ఏళ్ల పైబడిన నిరక్షరాస్యులు, గతంలో మధ్యలో బడి మానేసిన వారు కార్యక్రమం ద్వారా చదువు నేర్చుకోవచ్చని తెలిపారు. ముఖ్యంగా స్వయం సహాయక బృందాలలో ఉండి చదువురాని మహిళలు, ప్రభుత్వ పాఠశాలల్లో పని చేసే ఆయాలు, వంట చేసేవారు, హెల్పర్లు, ప్రభుత్వ పాఠశాలల్లో రాత్రి వాచ్‌మేన్‌గా పని చేస్తూ చదువురాని వారి కోసం, అంగన్‌వాడీ కేంద్రాల్లో పని చేసే నిరక్షరాస్యులైన ఆయాల కోసం కార్యక్రమం రూపొందించినట్లు పేర్కొన్నారు. ప్రభుత్వ సంస్థల్లో పని చేసే చదువురాని వారి కోసం కార్యక్రమం ఆదివారం రోజున నిర్వహించనున్నట్లు తెలిపారు. అక్షరాస్యత కేంద్రాల నిర్వహణ అంగన్‌వాడీ కేంద్రాలను వినియోగించుకోవాలనేందుకు అనుమతి ఇవ్వాలని ఐసీడీఎస్ పీడీని ఆదేశించారు. సమావేశంలో డీఆర్వో ఉదయభాస్కర్ రావు, జేసీ కార్తీక్, డీఈవో రామారావు తదితరులు పాల్గొన్నారు.


వీఎస్‌యూలో అబ్దుల్ కలాం విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న వీసీ, ఆచార్యులు

మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం సేవలు ఎనలేనివి

వెంకటాచలం: మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం జీవితం అందరికి ఆదర్శప్రాయమని ఉపకులపతి విజయభాస్కర రావు తెలిపారు. కలాం జయంతి సందర్భంగా మంగళవారం వీఎస్‌యూలో విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వీసీ మాట్లాడుతూ... సామాన్య కుటుంబం నుంచి వచ్చిన కలాం శాస్త్రవేత్తగా, రాష్ట్రపతిగా అందరి మన్ననలు పొందారన్నారు. దేశానికి ఆయన చేసిన సేవలు కొనియాడారు. రిజిస్ట్రార్ సునీత, ప్రిన్సిపల్ విజయ, పలువురు ఆచార్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కందుకూరు అభివృద్ధి మండలి కమిటీ ఎన్నిక

కందుకూరు పట్టణం, న్యూస్‌టుడే: పట్టణ అభివృద్ధి మండలి సమావేశం మంగళవారం ఆదిత్య ఫంక్షన్ హాలులో జరిగింది. ఈ సందర్భంగా నియోజకవర్గంలో


ఎంపికైన అభివృద్ధి మండలి కమిటీ సభ్యులు

అభివృద్ధి కార్యక్రమాలు, దీర్ఘకాలిక సమస్యల పరిష్కారం కోసం ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు, మాజీ ఎమ్మెల్యేలను కలుపుకుని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించుకోవాలని తీర్మానించారు. అనంతరం కమిటీని ఎన్నుకున్నారు. ఈసందర్భంగా మాజీ ఎమ్మెల్యే దివి శివరాం మాట్లాడుతూ రాళ్లపాడు జలాశయం నుంచి వచ్చే నీరు తాగేందుకు పనికిరాదని నీటి పరీక్షలో తేలిందన్నారు. ఈనేపథ్యంలో సురక్షితమైన నీరు అందించాలన్నారు. కందుకూరును ప్రకాశం జిల్లాలో కలపాలన్నారు. పట్టణంలో ట్రాఫిక్ సమస్యతో పాటు హోటళ్లలో ఆహార పదార్థాలు నాణ్యతగా ఉండేలా చూడాలని పలువురు కోరారు. కమిటీ అధ్యక్షుడిగా మాజీ ఎమ్మెల్యే దివి శివరామ్, ఉపాధ్యక్షులుగా షేక్ రఫీ, పాలేటి కోటేశ్వరరావు, కార్యదర్శిగా నేతి మహేశ్వరరావు, సహాయ కార్యదర్శులుగా బి.వి, సురేష్‌బాబు, కోశాధికారిగా కాకుమాని మాధవ, సభ్యులుగా రాజేంద్రబాబు, పులిచర్ల సుబ్బారెడ్డి, తోకల వెంకటేశ్వర్లు, అధికార ప్రతినిధులుగా ఆర్.వి, ఎం.కిషోర్, శాశ్వత ఆహ్వానితులుగా చింతరబోయిన నరేష్, పి.మాలకొండయ్య, అయ్యన్న, షేక్ హుస్సేన్, పొడపాటి శ్రీనును ఎన్నుకున్నారు.

విద్యుత్తు సమస్యలపై సత్వరమే స్పందించాలి

నెల్లూరు(విద్య), న్యూస్‌టుడే: ఎటువంటి విద్యుత్తు సమస్యలు తలెత్తినా సత్వరమే స్పందించాలని, పోల్స్ సిద్ధం చేసుకోవాలని విద్యుత్తు శాఖ చీఫ్ జనరల్ మేనేజర్, ఉమ్మడి జిల్లా తుపాన్ నోడల్ అధికారి కె.ఆదిశేషయ్య పేర్కొన్నారు. ఉమ్మడి నెల్లూరు జిల్లా విద్యుత్తు డివిజన్ పరిధిలో విద్యుత్తు వినియోగదారులకు అందుతున్న సేవలు, తుపాన్ ముందస్తు చర్యలు, సహాయక కార్యక్రమాలపై మంగళవారం ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వినియోగదారులకు సమస్యలు వస్తే కంట్రోల్ రూమ్‌కు, టోల్ ఫ్రీ 1912కు, వాట్సప్ నెంబర్ 9133331912కు సమస్య తెలపాలని పేర్కొన్నారు. ఉద్యోగులు పనిచేస్తున్న కేంద్రాల్లో ఉండాలని తెలిపారు. మనుబోలు, చిల్లకూరు, గూడూరు సబ్‌స్టేషన్లను తనిఖీ చేశారు. కార్యక్రమంలో గూడూరు ఈఈ నరేంద్రరెడ్డి, టౌన్ డీఈఈ ప్రసాద్, కోట సబ్‌స్టేషన్ డీఈ చిన్నయ్య, మనుబోలు ఏఈ శేషాద్రి, పోలయ్య తదితరులు పాల్గొన్నారు.


తుపాన్ సహాయక చర్యలపై సమీక్షిస్తున్న జిల్లా నోడల్ అధికారి ఆదిశేషయ్య

వాహనం ఢీకొని జింక మృత్యువాత

వెంకటాచలం, న్యూస్‌టుడే: మండలంలోని ఎర్రగుంట సమీపంలో జాతీయ రహదారిపై మంగళవారం గుర్తుతెలియని వాహనం ఢీకొని జింక మృతి చెందింది. స్థానికుల సమాచారం మేరకు అటవీ అధికారులు జింక కళేబరాన్ని స్వాధీనం చేసుకుని ఖననం చేశారు.


కోదండరామస్వామికి వెండి సర్వాంగ కవచాన్ని దాతలు కృష్ణమోహన్‌రెడ్డి, వెంకటకృష్ణారెడ్డి, శ్రీనివాసులురెడ్డి, సురేష్, ప్రసాద్, గాయత్రి, సుకుమార్ తదితరులు అందించారని వ్యవస్థాపక ధర్మకర్త మురళీకృష్ణారెడ్డి పేర్కొన్నారు. – న్యూస్‌టుడే, బుచ్చి

నేటి నుంచి ప్రైవేటు మద్యం దుకాణాలు

నెల్లూరు(నేర విభాగం): నూతన మద్యం పాలసీలో భాగంగా బుధవారం నుంచి ప్రైవేటు మద్యం దుకాణాలు ప్రారంభం కానున్నాయి. జిల్లా వ్యాప్తంగా 182 దుకాణాలకు లాటరీ విధానంతో లైసెన్సులు మంజూరు చేసిన విషయం తెలిసిందే. అందులో భాగంగా ఈనెల 16వ తేదీ నుంచి నూతన దుకాణాలు ప్రారంభం కానున్నాయి. ఆదిశగా ఎక్సైజ్ అధికారులు ఏర్పాట్లుచేశారు. గత ప్రభుత్వ మద్యం దుకాణాలు మంగళవారంతో తొలగించాల్సి ఉండగా, కొన్నింటిలో సరకు ఇంకా తరలించలేదు. దాంతో పాటు ఐఎంఎల్ డిపోలో కూడా పాత మద్యం అందుబాటులో ఉండటంతో వ్యాపారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రముఖ కంపెనీల మద్యం అందుబాటులో లేకపోవడం, గతప్రభుత్వం సరఫరా చేసిన మద్యం సీసాలే ఉండటంతో నష్టపోతామని వ్యాపారులు చెబుతున్నారు. రాత్రివరకు మద్యం కోసం డిపో వద్ద వ్యాపారులు బారులు తీరారు.

సమాచార స్రవంతి

బంగారం ధరలు

గ్రాము ధర:	రూ. 7,327
(3 శాతం జీఎస్టీ కలిసిన ధర)	
సవర ధర:	రూ. 58,616
వెండి గ్రాము :	రూ. 95. 60

వెంకాబ్ కోళ్ల ధరలు

బ్రాయిలర్ (రైతుధర)	135
రిటైల్	157
లేయర్	120
బ్రాయిలర్స్	228
బ్రాయిలర్స్ స్కిన్‌లెస్	259
లేయర్ మాంసం	204
నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్	
బ్రాయిలర్	145
లేయర్	120
బ్రాయిలర్స్	258
బ్రాయిలర్స్ స్కిన్‌లెస్	284
లేయర్ మాంసం	204


ఎన్నికైన కార్యవర్గ సభ్యులు

ఏపీ ఎన్జీవో సంఘం కార్యవర్గం

నెల్లూరు(కలెక్టరేట్) : ఏపీఎన్జీవో అసోసియేషన్ జిల్లా కార్యవర్గంలో ఏర్పడిన ఖాళీ పోస్టులను కోఆప్షన్ ద్వారా అభ్యర్థులను ఎన్నుకున్నారు. మంగళవారం నగరంలోని ఎన్జీవో భవనంలో జిల్లా అధ్యక్షుడు మన్నేపల్లి పెంచలరావు అధ్యక్షతన ఎన్నుకోగా.. పరిశీలకులుగా రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి కిలారు జగదీశ్వరరావు వ్యవహరించారు. ఎన్నికల్లో జిల్లా కార్యదర్శిగా గాదిరాజు రామకృష్ణ, కోశాధికారిగా వీఎంవీ ప్రసాద్‌రెడ్డి, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా లక్కాకుల పెంచలయ్య, ఉపాధ్యక్షుడిగా పులి సతీష్‌బాబు, సంయుక్త కార్యదర్శిగా ఏవీ కృష్ణకుమార్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు బండారుపల్లి వెంకటేశ్వర్లు, జిల్లా సహాధ్యక్షుడు ఆంజనేయవర్మ, ఉపాధ్యక్షుడు కరుణమ్మ, మధు, కృష్ణంరాజు, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

డిపాజిట్ పేరుతో రూ.1.16 కోట్లు స్వాహా

నెల్లూరు(నేర విభాగం), న్యూస్‌టుడే: బ్యాంకులో నగదు డిపాజిట్ చేస్తామని చెప్పి ఓ వ్యక్తి రూ.1.16 కోట్లు కాజేసిన ఘటనపై బాలాజీ నగర్ పోలీసులు మంగళవారం రాత్రి కేసు నమోదు చేశారు. వారి కథనం మేరకు.. బాలాజీ నగర్‌కు చెందిన ప్రశాంతి విశ్రాంత షార్ ఉద్యోగి. ఆమెకు రిటైర్‌మెంట్ సందర్భంగా వచ్చిన నగదును కుటుంబ సభ్యుల పేర్లపై డిపాజిట్ చేయాలని నిర్ణయించుకున్నారు. 2016లో రామలింగాపురంలోని ఓ లైఫ్ ఇన్సూరెన్స్ కార్యాలయాన్ని సంప్రదించారు. అక్కడ పనిచేస్తున్న హనుమంతరావు పరిచయమయ్యాడు. ఆయన సూచనల మేరకు తన కుటుంబ సభ్యుల పేర్లపై పలు దఫాలుగా రూ.1.16కోట్లు డిపాజిట్ చేశారు. డిపాజిట్‌కు సంబంధించి 2021 వరకు ప్రతినెలా వడ్డీ వచ్చింది. అనంతరం ఆగిపోయింది. పలుమార్లు హనుంతరావును సంప్రదించగా కాలయాపన చేస్తూ వచ్చారు. చివరకు ఆమె బ్యాంకుకు వెళ్లి విచారించగా.. ఆమె, కుటుంబ సభ్యుల పేర్లపై ఎలాంటి డిపాజిట్లు, స్కీమ్‌లు లేవని తేలింది. నగదు మొత్తం హనుమంతరావు కాజేశాడని గుర్తించిన ఆమె.. నిలదీయగా త్వరలో ఇస్తానని నమ్మిస్తూ వచ్చారు. ఎంతకీ నగదు ఇవ్వకపోవడంతో బాలాజీనగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని ఇన్‌స్పెక్టర్ సాంబశివరావు తెలిపారు

మార్కెట్‌లో యువకుడి దారుణ హత్య

నెల్లూరు(నేర విభాగం), న్యూస్‌టుడే: యువకుడిని ఇద్దరు యువకులు కత్తితో పొడిచి దారుణంగా హత్య చేశారు. ఈ ఘటన నగరంలోని ఏసీ కూరగాయల మార్కెట్ వద్ద మంగళవారం తెల్లవారు జామున చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. నగరంలోని అనగుంటకు చెందిన వాకా అశోక్ (29) నివాసం ఉంటున్నారు. ఆయనకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఆరేళ్ల క్రితం పానీపూరి విక్రయించే వ్యక్తిని హత్య చేసిన కేసులో వేదాయపాలెం పోలీసులు రౌడీ షీటు తెరిచారు. ప్రస్తుతం అశోక్ ముత్తుకూరు గేటు సెంటరులోని సర్వేపల్లి కాలువ కట్టపై ఉంటూ ఏసీ కూరగాయల మార్కెట్‌లో కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. సోమవారం రాత్రి మార్కెట్‌లో పనిచూసుకుని టిఫిన్ చేసేందుకు సమీపంలోని బండి వద్దకు వెళ్లారు. ఇంతలో ఇద్దరు యువకులు అతని వద్దకు వచ్చి.. ఇంకా మారవా అంటూ ప్రశ్నించారు. మీకెందుకురా అని అశోక్ ప్రశ్నిస్తుండగా ఇద్దరిలో ఒకరు కత్తితో బలంగా పొడిచారు. ఇంతలో టిఫిన్ అంగడి నిర్వాహకుడు రమేష్ యువకులను వారించడంతో నిందితులు పరారయ్యారు. గాయాలపాలైన అశోక్ అక్కడి నుంచి నడుచుకుంటూ వెళ్లి మార్కెట్‌లోని ఓ దుకాణం వద్ద కుప్పకూలిపోయారు. గుర్తించిన అక్కడి వారు 108లో జిల్లా ప్రభుత్వాస్పత్రికి తరలించారు. సమాచారం అందుకున్న చిన్నబజారు ఇన్‌స్పెక్టర్ చిట్టెం కోటేశ్వరరావు ఆసుపత్రికి చేరుకుని అశోక్‌ను వివరాలు అడిగి తెలుసుకున్నారు. చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుని సోదరుడు వంశీ ఫిర్యాదు మేరకు హత్య కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. స్థానికంగా సీసీ కెమెరాలు పరిశీలించగా ఇద్దరు యువకులు పరారవుతున్నట్లు గుర్తించారు.


మార్కెట్‌లో కుప్పకూలిన అశోక్

రైలు కింద పడి వృద్ధురాలి ఆత్మహత్య

నెల్లూరు(నేర విభాగం), న్యూస్‌టుడే: గుర్తుతెలియని వృద్ధురాలు రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్న సంఘటన వెంకటేశ్వరపురం రైల్వే బ్రిడ్జి వద్ద మంగళవారం చోటుచేసుకుంది. సమాచారం అందుకున్న నెల్లూరు రైల్వే ఎస్సై జి.మాలకొండయ్య సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. మృతురాలికి సుమారు 60 ఏళ్ల వయసు ఉంటుందని, నలుపు, పసుపు రంగు చీర, పసుపు రంగు జాకెట్ ధరించి ఉన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే పోలీసులు తెలిపారు.

కుటుంబ కలహాలతో బలవన్మరణం



కావలి, న్యూస్‌టుడే: పట్టణంలోని పాతూరులో **కూర శ్రీకాంత్** (28) కుటుంబ కలహాలతో ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వెంగాయగారిపాలెంలో నివసించే ఇతను రెండు రోజుల క్రితం భార్యతో గొడవ పడి ఇంటి నుంచి వెళ్లిపోయాడు. మంగళవారం ఉదయం బావిలో మృతదేహమై కనిపించాడు. ఈ విషయం తెలియగానే పురపాలక కమిషనర్ శ్రావణ్‌కుమార్ పోలీసులకు సమాచారమిచ్చారు. ఒకటో పట్టణ సీఐ షేక్ ఫిరోజ్‌ఖాన్, ఎస్సై ఎస్.సుమన్ సిబ్బందితో అక్కడకు చేరుకొని మృతదేహాన్ని వెలికితీయించారు. కుటుంబ కలహాల నేపథ్యంలోనే అతను ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు భావిస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రాంతీయాసుపత్రికి తరలించారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

వరుస ఘటనలతో ఆందోళనలో ప్రజలు

కలువాయి, న్యూస్‌టుడే: కలువాయిలో తాళం వేసిన గృహాల్లో దుండగులు కొన్ని రోజులుగా వరుస చోరీలకు పాల్పడుతుండటంతో స్థానికులు భయభ్రాంతులకు గురవుతున్నారు. రాజావీధిలోని కేతా శ్రీనివాసులురెడ్డి ఇంట్లో సోమవారం రాత్రి గుర్తు తెలియని దుండగులు చోరీకి పాల్పడ్డారు. శ్రీనివాసులురెడ్డి ఉప గుత్తేదారుగా ఆయన కుమారుడు సాఫ్ట్‌వేర్ ఉద్యోగి కాగా బెంగళూరులో ఉంటున్నారు. ఇటీవల తాళం వేసి ఊరి కెళ్లారు. సోమవారం రాత్రి దొంగలు తలుపు తాళాలు ధ్వంసం చేసి లోపలికి ప్రవేశించారు. బీరువాలో ఉన్న రూ.90 వేల నగదు, పది గ్రాముల బంగారం అపహరించారు. ఉదయాన్నే తలుపు తాళాలు తెరచి ఉండగా గమనించిన స్థానికులు వారి బంధువుల ద్వారా పోలీసులకు సమాచారమిచ్చారు. ఎస్సై సుమన్ సంఘటన ప్రాంతాన్ని పరిశీలించారు. కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు పేర్కొన్నారు.

ప్రమాదాలు జరుగుతున్నా పట్టదా?

గుంతలు తేలిన జాతీయ రహదారి


వాటర్ ట్యాంకు ఎదురుగా రోడ్డు దుస్థితి

న్యూస్‌టుడే, కలిగిరి

అది జాతీయరహదారి. దాన్ని చూస్తే పల్లెటూరి దారి అనుకోవాల్సిందే. అడుగడుగునా గోతులతో అధ్వానంగా తయారైంది. వీటిలో పడి వాహనాలు ప్రమాదాలకు గురవుతున్నాయి. పలు ఘటనల్లో ప్రాణాలు పోతున్నాయి. అయినా అధికారులు చూసీ చూడనట్లుగా వ్యవహరిస్తున్నారు. దీంతో ప్రజలు నిత్యం ఇబ్బందులు పడుతున్నారు. ఇదీ కావలి-సీతారామపురం జాతీయరహదారి (567 బీజీ)పై పరిస్థితి. అధికారుల ఉదాసీనత, గుత్తేదారుల నిర్లక్ష్యం ప్రజలకు శాపంగా మారింది. ఈ మార్గంలోని గోతులతో ప్రయాణికులు, స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రహదారి నిర్మాణ పనుల్లో భాగంగా కలిగిరి మెయిన్ రోడ్డుపై ఓవర్‌హెడ్ ట్యాంకు ఎదురుగా గతంలో ఉన్న సిమెంటు రోడ్డును పగులకొట్టారు. ఆ తర్వాత అక్కడ రోడ్డు నిర్మాణంలో జాప్యం జరుగుతోంది. వీటిని మట్టితో నింపుతున్నారు. కలిగిరి నుంచి కావలి మార్గంలో సాయివర్షిత్ హాస్పిటల్ ఎదురు, కల్యాణమండపం సమీపంలో పెద్ద పెద్ద గోతులు ఉన్నాయి. ఈ ప్రాంతంలో నూతనంగా జాతీయ రహదారి నిర్మాణం వివిధ కారణాలతో జాప్యం జరుగుతోంది. పాత రోడ్డుకు మరమ్మతులు సక్రమంగా చేయలేదు. గోతుల్లో ద్విచక్ర వాహనాలు బోల్తా పడడంతో పలువురు గాయాల పాలవుతున్నారు. గుత్తేదారులు గోతులను మట్టితో నింపడంతో వాహనాల రాకపోకలకు ఆ మట్టి లేచిపోవడంతో తిరిగి యధావిధిగా తయారవుతున్నాయి.

గోతులు తెలియక..

ప్రస్తుతం వర్షాలకు గోతుల్లో నీరు చేరింది. లోతు తెలియక వేగంగా వచ్చే వాహనాలు వాటిల్లో పడడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. వాహనాలు మరమ్మతులకు గురవుతున్నాయి. మరోవైపు వాటర్‌ట్యాంకు ఎదురు, హాస్పిటల్ ఎదురుగా నిత్యం రద్దీగా ఉంటుంది. అక్కడ గోతుల్లో వర్షపు నీరు ఉండడం, వేగంగా వెళ్లే వాహనాల తాకిడికి ఆ బురద నీరు ఆ ప్రాంతంలో తిరిగే ప్రజలపై పడుతోంది. తక్షణమే తారు మిశ్రమంతో మరమ్మతులు చేయాలని ప్రజలు కోరుతున్నారు. ఈ విషయమై ఎన్‌హెచ్ ఏఈ సుమన్‌ను 'న్యూస్‌టుడే' వివరణ కోరగా వెంటనే గుత్తేదారుతో మాట్లాడి మరమ్మతులు చేయిస్తామన్నారు. వాహనదారులు, ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూస్తామని వివరించారు.


గుంతల్లో నిలిచిన నీరు

ప్రజలకు మెరుగైన వైద్యసేవలందించండి

ఇందుకూరుపేట: భారీ వర్షాల నేపథ్యంలో తుపాను రక్షిత భవనాల్లో ఉన్నవారికి ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించాలని జిల్లా వైద్యాధికారి పెంచలయ్య అన్నారు. అల్పపీడన ప్రభావంతో భారీ వర్షాలు కురుస్తున్నందున జగదేవిపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మంగళవారం ఆయన సందర్శించారు. అత్యవసర వైద్య బృందాల వివరాలు అడిగి తెలుసుకున్నారు. నాలుగు రోజుల్లో డెలివరీ అయ్యే గర్భిణుల వివరాలు సేకరించి వైద్యసేవలు అందించాలని సూచించారు. ప్రతిఒక్కరూ ప్రజలకు అందుబాటులో ఉండాలని, అవసరమైతే వైద్య శిబిరాలు ఏర్పాటుచేయాలన్నారు. కార్యక్రమంలో వైద్యులు కిషోర్‌కుమార్, బ్రహ్మేశ్వరనాయుడు, జిల్లా ఎపిడమిక్ వైద్యాధికారి ప్రమోద్, హెచ్ఈవో శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

నెల్లూరు(విద్య), న్యూస్‌టుడే: జిల్లాలో డీఎస్సీకి సిద్ధమవుతున్న గిరిజన నిరుద్యోగ యువతీ యువకులకు డీఎస్సీలో భోజన వసతితో కూడిన ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు ఐటీడీఏ ప్రాజెక్టు అధికారిణి పరిమళ ప్రకటనలో పేర్కొన్నారు. అర్హులైన అభ్యర్థుల నుంచి ఈ నెల 21వ తేదీలోపు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు ఆహ్వానించినట్లు తెలిపారు. వివరాలకు 81878 99877 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

EENADU Classifieds

REAL ESTATE

FLAT FOR SALE

నెల్లూరు నగరంలో మదర్ ల్యాండ్ డెవలపర్స్ వారి నూతనంగా నిర్మించుచున్న ప్రీమియం అపార్ట్‌మెంట్స్ (రెయిన్ స్ట్రీట్ థియేటర్ వెనుక & శాంతినగర్) నందు 2 BHK & 3 BHK Flats అమ్మకమునకు కలవు. Ph: 79954 22204, 79954 22201

బాలాజీనగర్ పుట్టవీధిలో సత్యనారాయణ టవర్స్, 3వ ఫ్లోర్ ఈస్ట్ ఫేసింగ్, 1572 Sft, 3BHK ఫ్లాట్ అమ్మబడును. నో మీడియేటర్స్, Only Direct Parties. ✆ 62816 08824

SHOP FOR SALE

ధనలక్ష్మీపురం మెయిన్ రోడ్డు నందు మంచి రన్నింగ్‌లో ఉన్న సూపర్ మార్కెట్ అమ్మబడును. వెంటనే సంప్ర|| ✆ 96429 39585

JOBS

JOB VACANCY: Marketing (Male) Good Communication Skills with Diploma/ Degree. Experience: 0-2 Years. Contact: ✆ 70134 69542.

Wanted Principals to Run the School, English Fluency need, Qul: PG + B.Ed., Exp: 2 Years. Lady Principal - Primary -1 (Salary: 25 K to 35 K), Gents Principal - High School - 1 (Salary: 30 K to 40 K). Cont: Vivekanandha E.M School, Buchi. ✆ 94401 22213.

త్రివేణి హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను / పేషెంట్స్‌ని చూసుకొనుటకు వర్కర్స్ / నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం 18K. ✆ 91609 00024, 96404 00073.

సురక్ష స్కూల్ ఆఫ్ నర్సింగ్‌లో ప్రిన్సిపాల్‌గా పనిచేయుటకు MSc నర్సింగ్, 1 Yr Experience లేదా BSc నర్సింగ్ 2Yrs Experience గల వారు కావలెను. ✆ 93476 41395

లేడీ కంప్యూటర్ ఆపరేటర్ కావలెను. ఆఫీసులో పనిచేయుటకు MS-Officeలో అనుభవం, English (చదవడం / రాయడం) జీతం: 12-15K ✆ 91337 72288

ఫీల్డ్ సూపర్‌వైజర్స్ కావలెను. (బైక్ తప్పనిసరి) చదువు ఉన్నా, లేకున్నా పర్వాలేదు, వయస్సు 45 సం|| లోపు. మగవారు మాత్రమే. ✆ 91337 72288

విజయ హాస్పిటల్, పొగతోట, నెల్లూరు నందు కంప్యూటర్ ఆపరేటర్ Female కావలెను. ఆరోగ్యశ్రీ ప్రోగ్రామ్ తెలిసిన వారికి ప్రాధాన్యత. ✆ 63043 17269, 63053 17269

MARKETING/ SALES

Wanted Experienced Mangers, Sales Men & Sales Girls (Experienced or Freshers) for Firstcry.com Kids Showroom at Dargamitta. Contact: 9985417444, 9849096674

MEDICAL

Leading Pharma Company Wanted Sales Representatives @Nellore Region., 1to2Yrs. Experience. Quali : Science / B.Pharma : ✆ 73863 52929.

అధిక స్పందనలు పొందండి. వాహనాలు అమ్మకం, ఉద్యోగాల భర్తీ, ఇళ్లు, ప్లాట్లు, స్థలాలు అమ్మకాలు, కొనుగోళ్లు, ఇళ్లు, షాపులు, ప్లాట్లు అద్దెకు మరియు అన్ని రకాల బిజినెస్ వ్యవహారాలు... B/W 5 లైన్ల ప్రకటన రూ. 470/- మాత్రమే వివరాలకు.. నెల్లూరు 80080 01790

మీ చిన్నారులకు పుట్టినరోజు శుభాకాంక్షలు ఈనాడు ద్వారా తెలపండి. B&W : రూ. 600 Colour : రూ. 800

ప్రకటనలపై 5% GST వర్తించును

గమనిక: క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తా పత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటన దారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్పు, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయ రాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

(c) eenadu

కావలి

•కావలి • ఉదయగిరి • కందుకూరు

పడవ మునిగిందని..

బిట్రగుంట, న్యూస్‌టుడే: బోగోలు మండలం జువ్వలదిన్నె సమీపంలో సముద్రంలో పడవ మునిగినట్లు మంగళవారం అధికారులకు సమాచారం అందింది. హుటాహుటిన బోగోలు తహసీల్దారు సురేష్‌బాబు, కావలి గ్రామీణ సీఐ పాపారావు, బిట్రగుంట ఎస్సై భోజ్యానాయక్ వేర్వేరుగా సిబ్బందితో వెళ్లారు. అక్కడ ఉన్న పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసులు మత్స్యకారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. ఓ రేకు దూరంగా కనిపించడంతో పడవ బోల్తా పడిందని భావించామని.. ఒడ్డుకు కొట్టుకు వచ్చింది రేకుగా గుర్తించామని చెప్పడంతో ఊపిరి పీల్చుకున్నారు.

అభయాంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ ఉత్సవాలు

సీతారామపురం, న్యూస్‌టుడే: సీతారామపురం పడమటి వీధిలోని రామాలయం పక్కన నూతనంగా నిర్మించిన అభయాంజనేయస్వామి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠ ఉత్సవాలు మంగళవారం ప్రారంభమయ్యాయి. మహేశ్వర్ ఆధ్వర్యంలోని రుత్విక్కులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.



పూజలు చేస్తున్న రుత్విక్కులు

పునరావాసం మమ

కావలి, న్యూస్‌టుడే: పునరావాస కేంద్రాల నిర్వహణలో అధికారుల నడుమ సమన్వయం కరవవుతోంది. పట్టణంలోని మర్రి చెట్టు గిరిజన కాలనీలో వర్షపు నీరు తగ్గడంతో కొందరు ఇళ్లకు వెళ్లారు. దీంతో అక్కడి పాఠశాలలో ఏర్పాటైన కేంద్రం మూసివేయాలనే ఆదేశాలు వచ్చాయి. రామ్మూర్తిపేటలోని ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటైన కేంద్రాన్ని కూడా మూసివేసేందుకు అధికారులు ప్రయత్నిస్తుండడంతో ఎస్సీ కాలనీవాసులు తప్పుబట్టారు. అధికారులు, బాధితుల నడుమ వాదనలు చోటుచేసుకున్నాయి. మరో రెండు రోజులపాటు భారీ వర్షాలు కురవవచ్చనే సమాచారంతో కేంద్రాన్ని కొనసాగించాలని పట్టుబట్టారు. ఈ విషయమై కావలి పురపాలక కమిషనర్ శ్రావణ్‌కుమార్ మాట్లాడుతూ పునరావాస కేంద్రాలు అవసరాలంత తగ్గట్లుగా కొనసాగిస్తామన్నారు. తహసీల్దార్ శ్రావణ్‌కుమార్ ఇదే విషయమై స్పందిస్తూ మర్రిచెట్టు గిరిజన కాలనీ కేంద్రంలో ఎవరూ ఉండడం లేదన్నారు. ఆహారం తీసుకుని ఇళ్లకు వెళ్తుండటంతో మూసివేశామన్నారు.

ముంపువాసులకు ఆశ్రయం

ఉలవపాడు, న్యూస్‌టుడే: మండలంలోని మన్నేటికోటలోని తిరుపతిగుంట సంపంలోకి వర్షపు నీరు రావడంతో ప్రజలను మంగళవారం పునరావాస కేంద్రాలకు పోలీసులు తరలించారు. 40 గృహాలున్న ఈ సంపంలోని ప్రజలను అదే గ్రామంలోని తుపాను షెల్టర్‌కు తరలించారు.

పట్టు విడవని వాన



కావలి చెరువుకట్ట సంపంలో దెబ్బతిన్న ఇళ్లు

న్యూస్‌టుడే, కావలి

పట్టిన పట్టు విడవకుండా వర్షాలు కురుస్తున్నాయి. మూడురోజులుగా కురుస్తుండడంతో ప్రజలు ఇళ్లకే పరిమితమయ్యారు. కావలి, కందుకూరు డివిజన్లలో రికార్డు స్థాయిలో, ఉదయగిరి నియోజకవర్గంలో ఓ మోస్తరు స్థాయిలో వర్షపాతం నమోదైంది. మధ్యమధ్యలో తెరిపి ఇచ్చి మళ్లీ కుండపోతగా కురుస్తోంది. దీంతో వీధులన్నీ జలమయమయ్యాయి. లోతట్టు ప్రాంతాలు ముంపునకు గురయ్యాయి. వాగులు, చెరువుల్లోకి నీరు చేరుతోంది. ఒక రోజు వ్యవధిలో కావలి డివిజన్ పరిధిలో 13 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. పట్టణంలోని దివ్యాంగులు, మర్రిచెట్టు గిరిజన కాలనీలో భారీగా నీరు చేరింది. ఎమ్మెల్యే కృష్ణారెడ్డి స్పందించి నీరు నిలబడకుండా కాలువలు తీయించారు. చెరువుకట్ట సంపం, శివరామసుబ్బయ్యకాలనీ, తదితర ప్రాంతాల వారిని పునరావాస కేంద్రాలకు తరలించారు. ఆర్డీవో ఎం.వంశీకృష్ణ, పురపాలక కమిషనర్ ఏర్పాట్లు పర్యవేక్షిస్తున్నారు.

ఉదయగిరిలో

ఉదయగిరి : మండలంలో మంగళవారం తెల్లవారు జాము నుంచి ఉదయం 8 గంటల వరకు 49.6 మి.మీ వర్షపాతం నమోదైంది. అనంతరం సాయంత్రం వరకు ఆకాశం మేఘావృతమై చినుకు రాలలేదు. ఈవర్షంతో పంటలకు ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందని రైతులు అంటున్నారు.



పేదల కాలనీలో ఆర్డీవో వంశీకృష్ణ, కమిషనర్ శ్రావణ్‌కుమార్

రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు తాటిపర్తి దత్తాత్రేయమ్మ అనే మహిళ ఇంటి గోడకూలిపోయింది. అయితే ఇంట్లోని వారికి ఎలాంటి ప్రమాదం జరగలేదు. ఇలాగే మరో నాలుగు ఇళ్లు శిథిలావస్థలో దర్శనమిస్తున్నాయి. ప్రభుత్వం మంజూరు చేసే కాలనీ ఇళ్లను నిర్మించుకునేందుకు ఎదురుచూస్తున్నారు. అధికారులు గుర్తించి ప్రభుత్వం ఇళ్లను మంజూరు చేయాలని కోరుతున్నారు.

పల్లెల్లో జోరు వాన

కందుకూరు గ్రామీణం : మండలంలో రెండు రోజులుగా కురుస్తున్న వర్షంతో గ్రామాల్లో కాలువలు, రహదారులు జలమయమయ్యాయి. మండలంలో ఒక్క రోజే 121.మి.మీ వర్షపాతం నమోదైంది. మన్నేరుకు నీరు చేరుతుంది. జామాయిల్, సరుగుడు తోటల్లో నీరు నిలిచింది. ఆనందపురం, కొండముడుసుపాలెం గ్రామాలకు వెళ్లే మార్గంలోని ఎర్ర వాగు నిండుగా ప్రవహిస్తోంది. మంగళవారం మధ్యాహ్నం నుంచి వర్షపు జల్లులు నిలిచాయి. కోతకు వచ్చిన వరి చేలల్లో నీరు నిలిచి ఉండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.



నిండుగా మన్నేరు

కూలిన ఇల్లు

కొండాపురం : మండలంలోని గానుగపెంట అరుంధతీయవాడలో వర్షాలకు నాని ఇల్లు కూలిపోయింది. రెండు

చెరువులా కేసరిగుంట కాలనీ

కందుకూరు పట్టణం : పట్టణంలోని కేసరగుంట కాలనీ చెరువును తలపిస్తోంది. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు ఇళ్ల మధ్యలో వర్షపు నీరు చేరింది. అధికారులు స్పందించి కాలనీలో రోడ్లు, కాలువలు ఏర్పాటుచేయాలని స్థానికులు కోరుతున్నారు. మున్సిపల్ కమిషనర్ కె.అనూష మాట్లాడుతూ కచ్చా కాలువలు ఏర్పాటుచేసి వర్షపునీరు వెళ్లేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.



కేసరగుంట కాలనీలో నిలిచిన నీరు

మేమున్నాం.. మీకు తోడుగా!

(10 AM to 1 PM) కావలి : 80080 51666, 91548 46698
కందుకూరు: 70939 81624, ఉదయగిరి : 80085 73944

సమస్య : మండలంలోని కాకుటూరు పంచాయతీ పరిధిలోని బొంతవారిపాలెంలో అంతర్గత రహదారుల వెంబడి మురుగునీటి పారుదల వ్యవస్థ లేకపోవడంతో అధ్వానంగా మారాయి. - కోటయ్య, స్థానికుడు

సమాధానం : పంచాయతీ సర్పంచి దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం. - అబ్దుల్ బారి, పంచాయతీ కార్యదర్శి - న్యూస్‌టుడే, వలేటివారిపాలెం

? పట్టణంలోని 24వ వార్డు ప్రశాంతి కాలనీలో చర్చి ఎదురు వీధిలో వారం రోజులుగా వీధి దీపాలు వెలగడం లేదు. రాత్రిళ్లు అంధకారంలో ఇబ్బందులు పడుతున్నాం. - వరప్రసాద్, ప్రశాంతి కాలనీ

✓ సిబ్బందిని పంపి వెంటనే సమస్య పరిష్కరిస్తాం. - కె.అనూష, మున్సిపల్ కమిషనర్ - న్యూస్‌టుడే, కందుకూరు పట్టణం

? మా ప్రాంతంలో పదే పదే విద్యుత్తు సరఫరా నిలిపివేస్తున్నారు. మంగళవారం ఇలాగే తీసివేయడంతో ఇబ్బందులు పడ్డాం - దామిశెట్టిరాధాకిషోర్, ఉత్తర జనతాపేట

✓ వర్షాల వేళ సరఫరాలో నిలిపివేత చర్యలు తీసుకోవాల్సి వస్తోంది. ఇబ్బందులు తలెత్తకుండా చూస్తాం. - వై.వసంతరావు, ఏఈ, ఎస్పీడీసీఎల్ - న్యూస్‌టుడే, కావలి

ఉప్పుటేరొచ్చిందోచ్!

వర్షాలకు ఉప్పుటేరుకు నీరు చేరింది. గుడ్లూరు సమీపంలో ఎత్తు వంతెన వద్ద నిండుగా కనిపించింది. ఏరులోకి నీరు రావడంతో లింగసముద్రం, గుడ్లూరు మండలాల్లోని పరివాహక ప్రాంతాల్లో భూగర్భ జలాలు పెరుగుతాయని అన్నదాతలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. - న్యూస్‌టుడే, గుడ్లూరు



గుంతల దారి.. ప్రమాదాలే మరి!



వింజమూరు-నేరేడుపల్లి రోడ్డు గుంతలమయంగా మారింది. వర్షాలకు వీటిలో నీరు నిలిచి రాకపోకలకు వాహనచోదకులు ఇబ్బందులు పడుతున్నారు. కొన్ని చోట్ల గోతుల్లో అదుపు తప్పి కింద పడి గాయాలబారిన పడుతున్నారు. ఈ విషయాన్ని పీఐయూ డీఈ విశ్వేశ్వరరావు దృష్టికి తీసుకెళ్లగా మరమ్మతులకు ఎస్‌డీఆర్‌ఎఫ్ కింద రూ. 25.5 లక్షలు మంజూరు కాగా పనులు త్వరలో ప్రారంభిస్తామన్నారు. - న్యూస్‌టుడే, వింజమూరు

మురుగులో బోరు.. రోగాలు రావా?



మండలంలోని తిమ్మసముద్రంలో నీటి సరఫరా పథకం మరమ్మతులకు గురైంది. గత్యంతరం లేక స్థానికులు నీటి అవసరాల కోసం మురుగు నీటిలో కూరుకుపోయిన బోరు నీరు తెచ్చుకొని వాడుకుంటున్నారు. దీంతో రోగాల బారిన పడే ప్రమాదం ఉందని గ్రామానికి చెందిన మాజీ ఉప ఎంపీపీ టి.మధుసూదన్‌రావు, ప్రసాద్ ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై ఈవోపీఆర్డీ మహేశ్వరి మాట్లాడుతూ బోరు వద్ద మురుగు నీరు చేరకుండా చర్యలు తీసుకుంటామన్నారు.- న్యూస్‌టుడే, జలదంకి

విద్యుత్తు లైన్లకు మరమ్మతులు

భారీ వర్షాలతో కూలిన స్తంభాలను పునరుద్ధరించే పనుల్లో మంగళవారం ట్రాన్స్‌కో సిబ్బంది నిమగ్నమయ్యారు. ఏఈ దినేష్ ఆధ్వర్యంలో సిబ్బంది వివిధ గ్రూపులుగా ఏర్పడి మరమ్మతులు చేపట్టారు. కలిగిరిలో 4, కుడుములదిన్నెపాడు, చినఅన్నలూరు, తెల్లపాడు గ్రామాల్లో రెండు చొప్పున, శిద్ధనకొండూరులో 4 స్తంభాల స్థానంలో కొత్తవి ఏర్పాటు చేశారు. మంగళవారం సాయంత్రానికి ఆయా ప్రాంతాల్లో సరఫరాను పునరుద్ధరించారు. - న్యూస్‌టుడే, కలిగిరి



వరద ప్రాంతాల్లో సీఐ పరిశీలన



ఆముదాలదిన్నె గ్రామ సమీపంలో చప్టాను పరిశీలిస్తున్న సీఐ రాజేశ్వరరావు

కావలి గ్రామీణం,న్యూస్‌టుడే: మండలంలో వరద నీరు చేరిన ప్రాంతాలను సీఐ రాజేశ్వరరావు మంగళవారం పరిశీలించారు. చెన్నాయపాలెం, పెద్దపట్టపుపాలెం, రుద్రకోట, తుమ్మలపెంట, కొత్తసత్రం, అన్నగారిపాలెం గ్రామ పంచాయతీల్లో ఉన్న లోతట్టు ప్రాంతాల్లోకి నీరు చేరింది. ఆయా ప్రాంతాల్లో పర్యటించారు. ప్రధాన రహదారులపై ఉన్న చప్టాల వద్ద ప్రమాదాలు జరగకుండా చూడాలని సిబ్బందికి సూచించారు.

నిరుద్యోగులకు ఉపాధి కల్పనే ధ్యేయం : కాకర్ల

వరికుంటపాడు, న్యూస్‌టుడే: మెట్ట ప్రాంతంలో చిన్న తరహా పరిశ్రమలు నెలకొల్పి నిరుద్యోగులకు ఉద్యోగావకాశాలు కల్పించేందుకు కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే కాకర్ల సురేష్ పేర్కొన్నారు. మండలంలోని నార్తుకొండాయపాలెం, ధర్మవరం, కనియంపాడులో మంగళవారం తెదేపా కన్వీనర్ చంద్రా మధుసూదన్‌రావు, తెలుగు యువత అధ్యక్షులు ముజ్జే లక్ష్మీనారాయణ, తెదేపా మండల ప్రధాన కార్యదర్శి పోలిబోయిన శ్రీకాంత్‌యాదవ్ అధ్యక్షతన పల్లె పండుగ కార్యక్రమం నిర్వహించారు. నార్తుకొండాయపాలెం, ఎస్సీ కాలనీ, ధర్మవరం, కనియంపాడులో ఉపాధి సిమెంటు రోడ్ల నిర్మాణానికి భూమి పూజ నిర్వహించారు. కొండాయపాలెం ఎస్సీ కాలనీలో ఆర్వో ప్లాంటును ప్రారంభించారు. ధర్మవరంలో ఛత్రపతి శివాజీ, ఎన్టీఆర్ విగ్రహాలకు నివాళులు అర్పించారు. కార్యక్రమంలో డ్వామా పీడీ గంగాభవాని, జడ్పీటీసీ రావెళ్ల నాగేంద్ర, తెదేపా మాజీ కన్వీనర్ చంద్రా వెంకయ్య, వైస్ ఎంపీపీ దేవనబోయిన మధు, భాజపా, జనసేన మండల అధ్యక్షులు ఏనుగు ప్రభాకర్‌రెడ్డి, పఠాన్ నాయబ్‌రసూల్, ఎంపీడీవో వేణుగోపాల్‌రావు, తహసీల్దారు హేమంత్‌కుమార్, పీఆర్ డీఈ మణికుమార్, ఏపీడీ గాయత్రీదేవి పాల్గొన్నారు.

గ్రామీణ రహదారులకు మహర్దశ

గుడ్లూరు : గ్రామీణ రహదారుల రూపురేఖలు మారుతున్నాయని ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు అన్నారు. మంగళవారం మండలంలోని దారకానిపాడు, దప్పళంపాడులో రూ.20.94 లక్షలతో సిమెంటు రహదారులకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో డ్వామా పీడీ గంగాభవాని, మండల పార్టీ బాధ్యులు జనిగర్ల నాగరాజు, తహసీల్దారు స్వర్ణ, ఎంపీడీవో వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.


అప్రమత్తత తప్పనిసరి



కాలనీవాసులతో మాట్లాడుతున్న ఎంపీడీవో ప్రత్యూష

కలిగిరి : తుపానుపై సచివాలయాల సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఎంపీడీవో ప్రత్యూష తెలిపారు. వర్షాలపై మంగళవారం ఆమె సచివాలయాల సిబ్బందికి వివిధ విషయాలపై సూచనలు చేశారు. సెలవులు పెట్టకుండా ప్రజలకు అందుబాటులో ఉంటూ, ఎప్పటికప్పుడు సమాచారాన్ని, స్థానికంగా ఏర్పడే సమస్యలను తెలుసుకుని ఉన్నతాధికారులకు చేరవేయాలన్నారు. ముంపునకు గురయ్యే అవకాశం ఉన్న వెంకన్నపాలెం కాలనీకి వెళ్లి అక్కడి ప్రజలతో మాట్లాడారు. కలిగిరి పంచాయతీలో ప్రజలకు ఇబ్బందులు రాకుండా డ్రైనేజీలో అడ్డుగా వస్తున్న వ్యర్థాలను, పూడికను ఎప్పటికప్పుడు పారిశుద్ధ్య సిబ్బందితో తొలగింపు చర్యలు చేపట్టారు. పంచాయతీ కార్యదర్శి రవిచంద్ర అన్ని కాలనీలు, లోతట్టు ప్రాంతాల్లో తిరుగుతూ జేసీబీలతో వర్షపునీటిని బయటకు పంపే ఏర్పాట్లు చేస్తున్నారు. కాలనీల ప్రజలకు ఆహారం అందించారు.

తుపాను ప్రభావిత ప్రాంతాల్లో ఆహారం పంపిణీ



ఆహార పొట్లాలు పంపిణీ చేస్తున్న కమిషనర్ కె.అనూష, తెదేపా నాయకులు

కందుకూరు పట్టణం, న్యూస్‌టుడే: తుపాను ప్రభావిత ప్రాంతాల్లో పేదలకు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు సొంత నిధులతో మంగళవారం సుమారు 200 మందికి ఆహారం అందజేశారు. పట్టణంలోని గడ్డంవారి కొష్టాలు, ఏకలవ్యనగర్, పుట్ట ప్రాంతాల్లోని ఎస్టీలకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కె.అనూష, తెదేపా నాయకులు దామా మల్లేశ్వరరావు, గడ్డం మాలకొండయ్య, ముచ్చు వేణు, పులి నాగరాజు, రవిచంద్ర, మేడా మల్లికార్జున పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

గృహ నిర్మాణ లబ్ధిదారులకు నష్టం

దగదర్తి, న్యూస్‌టుడే: ప్రభుత్వ సాయం అందక లబ్ధిదారులు గృహ నిర్మాణాలు మధ్యలో నిలిపివేయడంతో నష్టపోయారని రాష్ట్ర ఇరిగేషన్ బోర్డు మాజీ డైరెక్టరు రవీంద్రనాయుడు ఆరోపించారు. మంగళవారం రంగసముద్రంలోని గృహనిర్మాణాలను పరిశీలించారు. లబ్ధిదారులు తిరిగి గృహనిర్మాణాలను ప్రారంభిస్తే తన వంతు సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పలువురు తెదేపా నాయకులు, గృహ నిర్మాణ లబ్ధిదారులు పాల్గొన్నారు.

ఘనంగా అబ్దుల్‌కలాం జయంతి

కందుకూరు పట్టణం : తుదిశ్వాస వరకు దేశ సేవలో తరించిన మహా తపస్వి మాజీ రాష్ట్రపతి, భారతరత్న అబ్దుల్‌కలాం అని ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు ప్రకటించారు. పట్టణంలోని తెదేపా కార్యాలయంలో మంగళవారం ఆయన జయంతి సందర్భంగా చిత్రపటానికి నివాళి అర్పించారు. కార్యక్రమంలో తెదేపా నాయకులు రఫీ, సలాం, ఖలీల్, గౌస్‌బాషా, నజీర్, మాబాషా, రెహమాన్, రూబీ, మున్నా, ఆరీఫ్ పాల్గొన్నారు.

ఆదర్శప్రాయులు ..

బిట్రగుంట : మాజీ రాష్ట్రపతి అబ్దుల్‌కలాం తరతరాలకు ఆదర్శప్రాయులని వక్తలు కొనియాడారు. బోగోలు మండలం ఇబ్రహీంపేటలో ఉన్న ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి స్థానికులు నివాళులర్పించారు. బిట్రగుంట రైల్వే అభివృద్ధి కమిటీ ప్రతినిధి నూరుద్దీన్, న్యాయవాది వెంకటరమణయ్య, దగదర్తి మండల జనసేన నాయకుడు డి.నాగరాజు తదితరులు ప్రసంగించారు.

చికిత్స పొందుతూ వృద్ధుడు మృతి

ఉలవపాడు : రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతూ మృతి చెందిన వ్యక్తి వైనమిది. ఎస్సై అంకమ్మ వివరాల మేరకు.. ఇటీవల ఉలవపాడులోని బైపాస్ రోడ్డులో గుర్తు తెలియని వాహనం ఢీకొని ద్విచక్రవాహనంపై వెళుతున్న తనసాన నాగేశ్వరరావు (65) గాయపడ్డాడు. ఇతనిది కారంచేడు. గౌరవరం నుంచి కారంచేడుకు ద్విచక్ర వాహనంపై వెళుతుండగా ఈ ప్రమాదం జరిగింది. అతన్ని చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించగా మంగళవారం ప్రాణాలు కోల్పోయాడు.

సిమెంటు రోడ్లకు శంకుస్థాపన

సీతారామపురం : మండలంలోని మారంరెడ్డిపల్లి పంచాయతీలో సిమెంటు రహదారుల నిర్మాణానికి మంగళవారం గ్రామ నాయకులు శంకుస్థాపన చేశారు. ఎమ్మెల్యే కాకర్ల సురేష్ చొరవతో గ్రామాలు అభివృద్ధి చెందుతాయని తెదేపా నాయకులు గాజులపల్లి చంద్రారెడ్డి, జినుగు వెంకటేశ్వర్లురెడ్డి, ఆళ్లూరి వెంకటసుబ్బయ్య అన్నారు. మారంరెడ్డిపల్లి, గంధంవారిపల్లిలో సిమెంటు రహదారుల నిర్మాణానికి కొబ్బరి కాయలు కొట్టి పూజ చేశారు.

వాననీటిలో దుకాణాలు

అల్లూరు : పట్టణంలోని పాతబస్టాండ్ వద్ద దుకాణాల్లోకి వర్షపు నీరు చేరింది. కాలువల్లో నీరు వెళ్లకపోవడంతోనే ఈ దుస్థితి ఏర్పడింది. నీరు వెలుపలకు వెళ్లేందుకు ఏర్పాట్లు చేయాలని దుకాణదారులు కోరుతున్నారు. ఈ విషయమై నగర పంచాయతీ కమిషనర్ ఉమామహేశ్వరరావును వివరణ కోరగా పరిశీలించి చర్యలు తీసుకుంటామన్నారు.

ప్రైవేటు ట్రావెల్స్ దోపిడీ

ఉదయగిరి, న్యూస్‌టుడే : ఉదయగిరి నుంచి బెంగళూరు వెళ్లే ప్రయాణికుల నుంచి ప్రైవేటు ట్రావెల్స్ బస్సుల వారు అధికంగా నగదు వసూలు చేస్తూ దోపిడీకి పాల్పడుతున్నారని ప్రయాణికులు ఆరోపిస్తున్నారు. ఉదయగిరి నుంచి బెంగళూరుకు సాధారణంగా ప్రైవేటు బస్సుల్లో రూ. 600 లోపు ఉంటుంది. పండగ సీజన్‌లో రూ. 1200 వరకు వసూలు చేస్తారు. ప్రస్తుతం సీటింగ్‌కు రూ. 1650, స్లీపర్‌కు రూ. 2500 వంతున వసూలు చేస్తూ ప్రయాణికులను దోచుకుంటున్నారని ఉదయగిరి నుంచి బెంగళూరు వెళ్లే ప్రయాణికులు వాపోతున్నారు. ఉదయగిరి మండలానికి చెందిన ఇద్దరు సోమవారం రాత్రి బెంగళూరు వెళ్లేందుకు ఒక ప్రైవేటు బస్సు ఎక్కారు. వారి నుంచి సీటుకు రూ. 3,300 వసూలు చేశారు. ప్రయాణికులు అంత ఎందుకు తీసుకుంటున్నారని ప్రశ్నిస్తే వర్షం పడుతున్నందున ధర తగ్గిందని, నిన్నటి వరకు ఒకరికి రూ. 2500 వసూలు చేశామని చెప్పడంతో వారు ఆశ్చర్యపోయారు.

వస్తువులు అందజేత

లింగసముద్రం : యర్రారెడ్డిపాలెంలోని 43 కుటుంబాలకు తెదేపా నాయకులు మాలకొండయ్య, మాధవరావు నిత్యావసర వస్తువులను మంగళవారం అందజేశారు. ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు ఆదేశాల మేరకు వీటిని పంపిణీ చేశారు. ఈకార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాసులు, తెదేపా నాయకులు పాల్గొన్నారు.

గ్రామీణ యువకులు.. క్రీడల్లో ఘనులు

న్యూస్‌టుడే, దగదర్తి, కావలి



శిక్షణ తీసుకుంటున్న యువకులు

గ్రామీణ యువకులు చదువుతో పాటు క్రీడల్లో రాణిస్తున్నారు. పట్టుదలతో సాధన చేసి జాతీయ స్థాయిలో సత్తా చాటారు. మరో తమ గ్రామంలోని సమస్యలను గుర్తించి పరిష్కారానికి కృషి చేస్తున్నారు. మండలంలోని శ్రీరామపురం, దగదర్తికి చెందిన యువకులు నిఖిల్, వినోద్ కుమార్ క్రీడల్లో జాతీయ స్థాయిలో ప్రతిభ చూపారు.

పోల్‌వాల్ట్‌లో ప్రతిభావంతుడు



దగదర్తికి చెందిన రామానాయుడు, వెంకట రమణమ్మ దంపతుల కుమారుడు నిఖిల్ క్రీడల్లో ప్రతిభ చూపుతున్నాడు. బి.సి.ఎ. రెండో సంవత్సరం చదువుతున్నాడు. ఆటలపై మక్కువతో చిన్నతనం నుంచే సాధన చేశాడు. కోచ్ రజనీకాంత్ సహకారంతో పోల్‌వాల్ట్, డెకాథ్లాన్ ఆటల్లో శిక్షణ పొందాడు. నెల్లూరులో ఇటీవల జరిగిన సౌత్ జోన్ స్టేట్ మీట్‌లో పోల్‌వాల్ట్, డెకాథ్లాన్ ఆటల్లో ప్రతిభ చూపి బంగారు పతకాలు సాధించి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. గతంలో విక్రమసింహపురి యూనివర్సిటీ స్థాయిలో కావలి జవహర్ భారతి కళాశాలలో నిర్వహించిన పోటీల్లో పోల్‌వాల్ట్‌లో బంగారు, 110 మీటర్ల హర్డిల్స్‌లో సిల్వర్ పతకాలు సాధించాడు. ఇంటర్‌లో లాంగ్ జంప్, ట్రిపుల్ జంప్, హైజంప్‌లో రాష్ట్ర స్థాయిలో జరిగిన పోటీల్లో పాల్గొని పలు పతకాలు గెలుచుకున్నాడు. మరో వైపు గ్రామీణ విద్యార్థులకు ఆటల్లో తర్ఫీదు ఇస్తున్నాడు. గ్రామంలో సమస్యల పరిష్కానికి యువకులతో కలసి కృషి చేస్తున్నాడు.

అథ్లెటిక్స్‌లో ప్రతిభ



శ్రీరామపురానికి చెందిన కేశవులు, శేషమ్మ దంపతుల కుమారుడు వినోద్‌కుమార్ క్రీడల్లో ప్రతిభ చూపుతున్నాడు. ప్రాథమిక విద్యాభ్యాసం ప్రభుత్వ పాఠశాలలో జరిగింది. బుచ్చిరెడ్డిపాలెం గుత్తికొండ డిగ్రీ కళాశాలలో బీకాం (కంప్యూటర్స్), కడపలోని యోగి వేమన యూనివర్సిటీలో బీపీఈడీ చదివాడు. క్రీడలపై ఆసక్తితో చిన్నతనం నుంచి కఠోర సాధన చేశాడు. గత సంవత్సరం పశ్చిమబెంగాల్‌లోని ఖరగ్‌పూర్‌లో జరిగిన 42వ నేషనల్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో బంగారు పతకాలు సాధించాడు. 800 మీ, 400 మీ పరుగు పోటీల్లో బంగారు పతకాలు సాధించాడు. విశాఖలో ఇటీవల జరిగిన పోటీల్లో ప్రతిభ చూపి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. మలేసియాలో జరిగే పోటీల్లో పాల్గొనే అవకాశం దక్కింది. ప్రస్తుతం డీఎస్సీ పరీక్షలకు శిక్షణ తీసుకుంటున్నాడు. రామలింగాపురం ఉన్నత పాఠశాల విద్యార్థులకు ఆటల పోటీల్లో శిక్షణ ఇస్తున్నాడు. గ్రామీణ సమస్యల పరిష్కారానికి ప్రిన్స్ యూత్ అసోసియేషన్‌తో కలసి పనిచేస్తున్నాడు.

మద్యం దుకాణం ఏర్పాటుపై ఆందోళన



నినాదాలు చేస్తున్న అన్నపూర్ణనగర్ వాసులు

ఉదయగిరి, న్యూస్‌టుడే : పట్టణంలోని అన్నపూర్ణనగర్‌లో మద్యం దుకాణం ఏర్పాటుకు అనుమతి ఇవ్వవద్దని స్థానికులు మంగళవారం ఎక్సైజ్ కార్యాలయం ఎదుట ఆందోళన చేశారు. ఈ సందర్భంగా స్థానికులు మాట్లాడుతూ అన్నపూర్ణనగర్ ప్రశాంతతకు మారుపేరుగా ఉందన్నారు. అలాంటి ప్రాంతంలో మద్యం దుకాణం ఏర్పాటు చేస్తే ప్రజలకు సమస్యగా మారుతుందన్నారు. సీఐ లక్ష్మణస్వామికి వినతిపత్రం అందజేశారు. సీఐ మాట్లాడుతూ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి స్థానికంగా మద్యం దుకాణం ఏర్పాటుకు అనుమతి ఇవ్వమన్నారు. కార్యక్రమంలో డాక్టరు వేణుగోపాల్, ఉపాధ్యాయులు చంద్రశేఖర్‌రెడ్డి, రమేష్, వీరారెడ్డి, వెంగళరెడ్డి, మల్లికార్జున, మాధవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పల్లెల్లో చిచ్చు రేపొద్దు

ఉదయగిరి : ప్రశాంతంగా ఉండే పల్లెల్లో మద్యం గొలుసు దుకాణాలను ఏర్పాటుచేసి చిచ్చు రేపొద్దని సీపీఎం జిల్లా నాయకుడు కాకు వెంకటయ్య పేర్కొన్నారు. స్థానిక పుచ్చలపల్లి సుందరయ్య భవనంలో మంగళవారం సీపీఎం, ప్రజా సంఘాల నాయకులతో కలిసి విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు మల్లికార్జున, లక్ష్మీనరసయ్య, కోడె రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

సర్వీసు రిజిస్టరు పడిపోయింది

రాపూరు రమణయ్య S/o లేట్ ఈశ్వరయ్య, వయస్సు 55 వెంబులూరు గ్రామం, దక్కిలి మండలం, తిరుపతి జిల్లా అను నేను శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా, సీతారామపురం మండలం, సీతారామపురం గ్రామమునకు తేది: 21-10-2020 నుండి తేది: 22-02-2022 వరకు గ్రామ రెవిన్యూ అధికారిగా పనిచేసి, ప్రస్తుతము సైదాపురం మండలము, సైదాపురం గ్రామమునకు రెవిన్యూ అధికారిగా పనిచేయుచున్నాను. రాపూరు రమణయ్య S/o లేట్ ఈశ్వరయ్యకు సంబంధించినది తేది: 06-05-2021న సీతారామపురం కెనరా బ్యాంకు ATM వద్ద సర్వీసు రిజిస్టరు పడిపోయింది. దొరికిన వారు ఈ క్రింది ఫోన్ నెంబర్‌కు తెలుపగలరు.

81793 89425

చెరువులకు గండ్లు పడకుండా చర్యలు

జలదంకి, న్యూస్‌టుడే : వర్షాలకు మండలంలోని చెరువులకు గండ్లు పడకుండా నీటిపారుదల శాఖ అధికారులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని తహసీల్దార్ ఎం.ప్రమీల తెలిపారు. మంగళవారం మండలంలోని జలదంకి పెద్ద చెరువును ఇరిగేషన్ ఏఈలు రామారావు, మాల్యాద్రితో కలసి పరిశీలించారు. మూడో నంబరు తూము గేట్లు మూయించారు. భారీ వర్షాలకు చెరువులకు వచ్చే వరద నీరు వృథాగా బయటకు పోకుండా అన్ని చెరువుల తూము గేట్లు మూయించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఆర్.ఐ. శ్రీజ, తెదేపా మండల అధ్యక్షుడు పి.మధురెడ్డి, ఇరిగేషన్ సిబ్బంది వెంకటేశ్వర్లురెడ్డి, పి. రవీంద్ర పాల్గొన్నారు.

వరల్డ్ ఫుడ్ డే శుభాకాంక్షలు

మా ఖాతాదారులకు, మిత్రులకు, శ్రేయోభిలాషులకు వరల్డ్ ఫుడ్ డే శుభాకాంక్షలు.
మీ ఇంట జరిగే వివాహాది శుభకార్యములకు ఆర్డర్లపై రుచికరమైన భోజనం సప్లయ్ చేయబడును.

శ్రీ అతిథి హోటల్
ప్యూర్ వెజిటేరియన్
(ట్రంకురోడ్, (గవర్నమెంట్ హాస్పిటల్ పక్కన), కావలి.
నాగరాజు : 99516 84404, సురేష్ : 91825 05664

కోవూరు

• కోవూరు • సర్వేపల్లి • ఆత్మకూరు

ఆక్రమణల తొలగింపునకు అధికారుల సర్వే

అనుమసముద్రంపేట, న్యూస్‌టుడే: ఏఎస్‌పేటలోని ప్రధాన ర.భ రోడ్డు ఆక్రమణలపై ఆ శాఖ అధికారులు సర్వే చేపట్టారు. వర్షపు నీరు ఎటూ వెళ్లకుండా రోడ్డుపై నిలవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ప్రజల ఫిర్యాదుతో ర.భ ఏఈ సిరాజుద్దీన్ ఆధ్వర్యంలో స్థానిక రెవెన్యూ కార్యాలయ అధికారులు మంగళవారం ఆక్రమణలకు గురైన రోడ్డును పరిశీలించి, సర్వే చేపట్టారు. రోడ్డు మధ్య నుంచి ఇరువైపులా 20 అడుగుల చొప్పున రహదారి విస్తరణకోసం మార్కింగ్ వేశారు. మొత్తం 40 అడుగుల రోడ్డు ఉండాలని, ప్రస్తుతం 25 అడుగులు లేదని, ఆక్రమణలతో వర్షపునీరు వెళ్లే మార్గంలేక రోడ్డుపైనే నిలవడం వల్ల సమస్య ఏర్పడిందని, సర్వే మార్కింగ్ పూర్తయిన వెంటనే తొలగింపు కార్యక్రమం చేపడతామని అధికారులు తెలిపారు.

తీరప్రాంత ప్రజలకు అండగా ఉంటాం

విడవలూరు : తుపాను నేపథ్యంలో తీరప్రాంత ప్రజలకు అండగా ఉంటానని తెదేపా నాయకులు అవ్వల వాసు అన్నారు. ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి, ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ఆదేశాలతో మండలంలోని రామతీర్థం, రామచంద్రాపురం పంచాయతీల్లోని పలు కాలనీల్లో మంగళవారం ఆయన పర్యటించారు. తెదేపా కార్యకర్తలు, నాయకులు అందుబాటులో ఉంటారని ఎలాంటి సహాయ సహకారాలు కావాలన్నా వెంటనే సమాచారం ఇవ్వాలని సూచించారు.

మేమున్నాం.. మీకు తోడుగా!
(10 AM to 1 PM) కోవూరు : 80085 73987, సర్వేపల్లి : 80085 73980, ఆత్మకూరు: 8008573949

వృద్ధుడి నేత్రదానం

విడవలూరు, న్యూస్‌టుడే: విడవలూరులోని జాన్‌పేటకు చెందిన ఎల్లు వెంకయ్య(52) మంగళవారం అనారోగ్యంతో మృతిచెందారు. నేత్రాలను మనసేవా సంస్థ సహకారంతో నెల్లూరు మోడరన్ కంటి వైద్యశాలకు కుటుంబ సభ్యులు దానం చేశారు. ఐ టెక్నీషియన్ వేణు మృతుడి కంటి కార్నియాను సేకరించారు.

జోరు వర్షం
స్తంభించిన జనజీవనం


కమ్మపాళెంలో పరిశీలిస్తున్న తహసీల్దారు స్ఫూర్తి


కోవూరులో..


మర్రిపాడు చెరువు గట్టువద్ద ఇసుక బస్తాలు వేస్తున్న కూలీలు


విడవలూరు మండలం ముదివర్తిలో..

బుచ్చి, కొడవలూరు, కోవూరు, పొదలకూరు, విడవలూరు, తోటపల్లిగూడూరు, ఆత్మకూరు, సంగం, మర్రిపాడు, ఏఎస్ పేట, అనంతసాగరం, సైదాపురం, న్యూస్‌టుడే: కోవూరు, సర్వేపల్లి, ఆత్మకూరు నియోజకవర్గాలతో పాటు రాపూరు, కలువాయి, సైదాపురం మండలాల్లో మంగళవారం ఎడ తెరిపి లేని వర్షం కురిసింది. పలు ప్రాంతాల్లో జనజీవనం స్తంభించింది. బుచ్చిరెడ్డిపాళెం, కొడవలూరు మండలాల్లో పలు ప్రాంతాలు జలమయమయ్యాయి. బుచ్చిలోని జగనన్నకాలనీల్లో లోతట్టుప్రాంతాల్లో వర్షపు నీరు బయటకు వెళ్లే మార్గం లేక అక్కడే ఆగింది. కమ్మపాళెంలో తహసీల్దారు స్ఫూర్తి జాతీయరహదారిపై ఒరిగిపోయిన చెట్లను తొలగించేలా చర్యలు తీసుకున్నారు. ❖ ముత్తుకూరు, తోటపల్లిగూడూరులో వర్షం వచ్చినపుడు కొంత సమయం విద్యుత్తు సరఫరా నిలిపేశారు. ❖ ఆత్మకూరు నియోజకవర్గంలో ఇళ్లు దెబ్బతిన్న, ముంపునకు గురయ్యే లోతట్టు ప్రాంతాల ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించినట్లు ఆర్డీవో పావని తెలిపారు. ❖ సంగం మండలంలోని కోలగట్ల ఎస్సీ కాలనీ, వీర్లగుడిపాడు గ్రామాల ప్రజలకు సురక్షిత ప్రాంతాలకు తరలించారు. ❖ ఏఎస్‌పేట మండలంలోని గుడిపాడు , కుప్పురుపాడు, కొండమీద కొండూరు గ్రామాల వద్ద ఉన్న వాగులను డీఎస్పీ వేణుగోపాల్ పరిశీలించారు. ❖ కోవూరు మండలంలో భారీ వర్షం కురిసింది. పట్టణంలోని రహదారులన్నీ జలమయమయ్యాయి. ముఖ్యంగా బజారు సెంటరు, చేపల మార్కెట్టు, మైథిలీహాల్, తాలూకాఫీసు, పంచాయతీ కార్యాలయాల వీధులన్నీ రోడ్లపై వర్షపు నీరు పారడంతో నదులను తలపించాయి. నారుమడులు వేసిన కోవూరు, పాటూరు, పడుగుపాడు, వేగూరు గ్రామాల్లోని రైతులు మాత్రం వర్షపు నీరు మరో రెండు మూడు రోజులు నిలబడితే నారు కుళ్లిపోతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. వ్యవసాయాధికారిణి ఇందిరావతి మాట్లాడుతూ రైతులు నారుమడుల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలన్నారు. ❖ విడవలూరు మండలం ముదివర్తిలో శివకృష్ణ అనే రైతుకు చెందిన పొలం నీట మునిగింది. సైదాపురం మండలంలో మోస్తరు వర్షం కురిసింది. ❖ పొదలకూరు మండలంలోని ఆల్తుర్తి-నావూరుపల్లి గ్రామాల మధ్య ఉన్న తిప్పవాగు ఉద్ధృతంగా ప్రవహిస్తోంది. కొందరు నిర్లక్ష్యంగా వాగును దాటుతుండటంతో స్థానికులు ఇరువైపులా కంచె వేశారు. దానిని తొలగించడంతో అధికారులు ఇరువైపులా రాకపోకలు సాగకుండా ముళ్లకంచె వేయించారు. కాలువల్లో పూడిక తీయకపోవడంతో నిమ్మమార్కెట్‌లో నీరు చేరింది. ❖ మైపాడు వద్ద సముద్ర తీరంలో అలల ఉద్ధృతి జోరుగా ఉంది. మత్స్యకారులెవరూ వేటకు వెళ్లకుండా అధికారులు నిలిపివేశారు. ❖ మనుబోలు మండలంలోని కండలేరు వాగును, తీరప్రాంతాలైన కట్టువపల్లి, కొలనుకుదురు గ్రామాల్లోని లోతట్టు ప్రాంతాలను పొదలకూరు సీఐ రాంబాబు పరిశీలించారు. ❖ సంగం మండలం మర్రిపాడు చెరువు ఒకటో నంబరు తూము వద్ద ఏఈ వినయ్‌కుమార్ కూలీలతో ఇసుక బస్తాలు వేయించారు.

❖ మనుబోలు మండలంలోని కొలనుకుదురు తుపాను షెల్టర్ భవనాన్ని పరిశీలించారు. గిరిజనకాలనీలో పర్యటించి వారిని అప్రమత్తం చేశారు.


పీకే పాడులో పునరావాస కేంద్రంలో కాలనీ వాసులు



పొదలకూరులో వాగు ఉద్ధృతిని పరిశీలిస్తున్న అధికారులు.. రాకపోకలు సాగించకుండా కందకం ఏర్పాటు


నిమ్మ మార్కెట్‌లో చేరిన నీరు

విపత్తు సమయాల్లో అప్రమత్తంగా ఉండాలి

మనుబోలు, న్యూస్‌టుడే : ఎలాంటి విపత్తునైనా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలని, తుపానుకు ఎలాంటి నష్టం వాటిల్లకుండా ముందస్తు చర్యలు తీసుకున్నామని ట్రాన్స్‌కో చీఫ్ మేనేజర్, జిల్లా నోడల్ అధికారి ఆదిశేషయ్య పేర్కొన్నారు. స్థానిక విద్యుత్తు ఉపకేంద్రాన్ని మంగళవారం తనిఖీ చేసి దస్త్రాలు పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ఎలాంటి ఇబ్బంది తలెత్తకుండా సిబ్బంది అందుబాటులో ఉండాలన్నారు. విద్యుత్తు స్తంభాలను అందుబాటులో ఉంచుకోవాలన్నారు. ఆయన వెంట సిబ్బంది తదితరులున్నారు.

కనిగిరి రిజర్వాయరు పరిశీలన

బుచ్చిరెడ్డిపాళెం, న్యూస్‌టుడే: బుచ్చిరెడ్డిపాళెం నగరపంచాయతీలోని కనిగిరి రిజర్వాయరు అలుగుతూములను సీఐ శ్రీనివాసులురెడ్డి పరిశీలించారు. తుపాను ప్రభావంతో నీటిమట్టాన్ని పరిశీలించారు. ప్రస్తుతం ప్రమాదం లేదని పేర్కొన్నారు.

భక్తిశ్రద్ధలతో ప్రార్థనలు

అనంతసాగరం, న్యూస్‌టుడే: అనంతసాగరంలోని నడివీధి, పీర్ సాహెబ్ పేట, కాలువ వీధి, గుంత బజారు వీధుల్లో మంగళవారం ముస్లిం సోదరులు గ్యార్మీ వేడుకలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. స్థానిక ముస్లిం యువత, మత పెద్దలు హాజరై ప్రత్యేక ఫాతెహా, దువాలు చేశారు. అనంతరం ముస్లిం సోదరులు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

విద్యుత్తు సరఫరాకు తరచూ అంతరాయం



పొదలకూరు మండలం బ్రాహ్మణపల్లి గ్రామ సమీపంలోని విద్యుత్తు నియంత్రిక చుట్టూ పిచ్చి మొక్కల తీగలు అల్లుకొని సరఫరాకు అంతరాయం కలుగుతోందని స్థానికులు వాపోతున్నారు. పలుమార్లు డిస్కం అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదని రైతులు తెలిపారు. డిస్కం ఏఈ శ్రీకాంత్ మాట్లాడుతూ సిబ్బందికి చెప్పి సమస్య పరిష్కరిస్తామన్నారు.

\- న్యూస్‌టుడే, పొదలకూరు, ఇందుకూరుపేట

కన్యకా పరమేశ్వరిగా పోలేరమ్మ



మనుబోలు, ముత్తుకూరు, తోటపల్లిగూడూరు, న్యూస్‌టుడే : దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా దేవాంగుల వీధిలోని పోలేరమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కన్యకా పరమేశ్వరి అలంకరణలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. సామూహిక కుంకుమార్చన కార్యక్రమం నిర్వహించారు. తోటపల్లిగూడూరు, ముత్తుకూరులో జరిగిన కార్యక్రమాల్లో భక్తులు అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

ఆంజనేయా.. దాటించవయా..!



కోవూరు మండలం పాటూరులో ఆంజనేయ స్వామి విగ్రహం సమీపంలో నడి రోడ్డుపై నీటి మడుగుతో ప్రజలకు అవస్థలు పడుతున్నారు. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలతో రోడ్డు మీదకు నీరు చేరింది. ఇరువైపులా పంట కాలువలున్నాయి. అటువైపు మళ్లిస్తే నీరు నిల్వ లేకుండా పోతుందని స్థానికులు చెబుతున్నారు. వివరణకు ర.భ శాఖ డీఈకి చరవాణిలో సంప్రదించగా అందుబాటులోకి రాలేదు. - న్యూస్‌టుడే, కోవూరు

జాతీయస్థాయి పోటీలకు ఎంపిక



మండల పరిధిలోని నార్తురాజుపాళెంలోని శ్రీవెంకటేశ్వర ఇంజినీరింగ్ కళాశాలకు చెందిన విద్యార్థులు జాతీయస్థాయి పోటీలకు ఎంపికకావడంతో కళాశాలలో మంగళవారం అభినందన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఛైర్మన్ గుణశేఖర్ మాట్లాడుతూ సాఫ్ట్‌బాల్‌లో వెంకటేశ్, క్రికెట్‌లో అజిత్, ఖోఖోలో రాంగోపాల్, ఫరియాలు జేఎన్‌టీయూ అనంతపురం తరపున జాతీయస్థాయి పోటీల్లో పాల్గొంటారని పేర్కొన్నారు. - న్యూస్‌టుడే, కొడవలూరు

జాతీయ సమైక్యత కోరుతూ సైకిల్ యాత్ర


సైకిల్‌పై వెళుతున్న వృద్ధుడు చంద్రదాస్

కోవూరు, న్యూస్‌టుడే: జాతీయ సమైక్యత, ఆధ్యాత్మికతను చాటుతూ చంద్రదాస్ గత నెలఒకటో తేదిన సైకిల్ యాత్ర ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ గంగోత్రి నుంచి రామేశ్వరం వరకు సైకిల్ యాత్ర చేపట్టి ప్రజల్లో చైతన్యం కలిగిస్తున్నట్లు పేర్కొన్నారు. వృద్ధుడు సైకిల్ యాత్రను చూసిన స్థానికులు ఆయనకు అభినందించారు.

చరవాణి వివాదం.. ఉరేసుకొని భార్య ఆత్మహత్య

ముత్తుకూరు, న్యూస్‌టుడే: కుటుంబ వివాదాల నేపథ్యంలో వివాహిత ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని కృష్ణపట్నంలో జరిగింది. పోలీసుల కథనం మేరకు... కృష్ణపట్నంలో రాంనగర్‌కు చెందిన స్వరూప(23)కు బాపట్లకు చెందిన మురళితో వివాహమైంది. రెండు రోజుల క్రితం దంపతులు కృష్ణపట్నం వచ్చారు. చరవాణి విషయంలో దంపతుల మధ్య సోమవారం సాయంత్రం వివాదం జరిగింది. మనస్తాపం చెందిన స్వరూప ఉరేసుకొని ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. గమనించిన కుటుంబ సభ్యులు హుటాహుటిన ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మృతిచెందారు. కృష్ణపట్నం పోర్టు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

కుటుంబ కలహాలతో గుళికలు తిని యువకుడి..

మనుబోలు : కుటుంబ కలహాల నేపథ్యంలో గిరిజన యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండలంలోని నాయుడుపల్లి సమీపంలోని బండేపల్లి బ్రాంచి కాలువ వద్ద జరిగింది. పోలీసుల వివరాల మేరకు... గొట్లపాలెం గిరిజనకాలనీకి చెందిన వెందోడు శీనయ్య(33) కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. దంపతుల మధ్య తలెత్తిన వివాదాలతో గుళికలు తిని ఆత్మహత్యకు పాల్పడ్డారు. పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. భార్య, ఇద్దరు పిల్లలున్నారు. పంచనామా నిమిత్తం గూడూరు ప్రాంతీయ వైద్యశాలకు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చికిత్స పొందుతూ క్షతగాత్రుడి మృతి

బుచ్చిరెడ్డిపాళెం : దామరమడుగు వద్ద రెండు ద్విచక్రవాహనాలు ఢీకొన్న ప్రమాదంలో క్షతగాత్రుడు చికిత్సపొందుతూ మృతిచెందారు. వివరాల్లోకి వెళితే..దామరమడుగుకు చెందిన నడవల శీనయ్య(53) ఈనెల 5న ఇంటికొస్తుండగా మరో ద్విచక్రవాహనం ఢీకొంది. ప్రమాదంలో నడవల శీనయ్యకు తీవ్రగాయాలై తిరుపతిలో చికిత్సపొందుతూ సోమవారం రాత్రి మృతిచెందారు. కేసునమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ శ్రీనివాసులురెడ్డి తెలిపారు.

కోవూరులో విద్యుత్తు కంట్రోల్ రూం ఏర్పాటు

కోవూరు : జిల్లాలో తుపాన్ ప్రభావం వల్ల విద్యుత్తుశాఖ సేవలు 24 గంటలపాటు ఉంటాయని ఈఈ రమేశ్‌చౌదరి తెలిపారు. సరఫరాలో అంతరాయం లేకుండా కంట్రోల్‌రూంను ఏర్పాటు చేశామన్నారు. ఎక్కడైనా స్తంభాలు కూలిపోయినా, తీగలు తెగిపోయినా వెంటనే కంట్రోల్‌రూం ఫోన్ నంబరు 9705200708కు సమాచారం ఇవ్వాలన్నారు.

అమ్మ రూపం.. ఆధ్యాత్మిక సంబరం


కోదండరామపురంలో అమ్మవారి గ్రామోత్సవం

మనుబోలు, న్యూస్‌టుడే: మండల కేంద్రమైన మనుబోలు, కోదండరామపురంలో జరుగుతున్న దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా ముగిశాయి. సోమవారం అర్ధరాత్రి దుర్గాదేవిని మహంకాళి అలంకరణలో గ్రామంలో ఊరేగించారు. విద్యుద్దీపాలంకరణలో తీర్చిదిద్దిన అమ్మవారి ప్రతిమలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. అనంతరం మేళతాళాలు, మంగళవాయిద్యాల నడుమ బాణసంచా కాలుస్తూ గ్రామోత్సవం వైభవంగా జరిగింది. సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఎలాంటి అవాంతరాలు జరగకుండా ఉత్సవ కమిటీ సభ్యులు జాగ్రత్తలు తీసుకుని భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు.

వ్యాసరచన పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

నెల్లూరు(విద్య) : వారధి ఫౌండేషన్ వారు రాష్ట్రస్థాయిలో ఆన్‌లైన్ ద్వారా నిర్వహించిన వ్యాసరచన, చర్చా వేదిక పోటీల్లో జిల్లా విద్యార్థులు ప్రతిభ చాటారు. సర్వేపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని బి.సంయుక్త వ్యాసరచన పోటీల్లో ద్వితీయస్థానంలో నిలిచిందని, పొదలకూరు జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల విద్యార్థులు సుమన్‌సాయి, చరిత, తేజస్విని, సృజన ప్రోత్సాహక బహుమతులు సాధించారని తెలిపారు.

చట్టవ్యతిరేక కార్యకలాపాలకి పాల్పడితే చర్యలు

గూడూరుపట్టణం : యువత చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని డీఎస్పీ రమణకుమార్ హెచ్చరించారు. గూడూరు పరిసర ప్రాంతాల్లో ఓ బాలుడిని కొందరు యువకులు కొడుతున్నట్లు సామాజిక మాధ్యమంలో వచ్చిన వీడియో స్థానిక ఎస్‌కేఆర్ కళాశాల సమీపంలో ఆగస్టు 22న జరిగినట్లు డీఎస్పీ వెల్లడించారు. స్థానిక రెండో పట్టణ పోలీసుస్టేషన్‌లో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. నెల్లూరు జిల్లా సైదాపురం మండలానికి చెందిన ఓ బాలుడు గూడూరు రెండో పట్టణంలో తన అక్క ఇంట్లో ఉంటున్నాడు. ఎస్‌కేఆర్ కళాశాలలో చదువుతున్న తిలక్‌నగర్‌కి చెందిన ఓ బాలుడితో ఘర్షణ జరిగింది. దీంతో తిలక్‌నగర్‌కి చెందిన బాలుడు తన స్నేహితులను తీసుకొచ్చి సైదాపురానికి చెందిన బాలుడిని కొట్టారు. పోలీసులకి ఫిర్యాదు చేస్తే చంపేస్తామనిబెదిరించడంతో బాలుడు పోలీసులకు ఫిర్యాదు ఇవ్వలేదని చెప్పారు. దాడి చేసిన వీడియో వైరల్ కావడంతో బాధిత బాలుడు మంగళవారం రెండో పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు ఇచ్చారు.

విత్తనశుద్ధితో పంటలకు మేలు

పొదలకూరు : మెట్ట, మాగాణి పైర్లు సాగుచేసే రైతులు ఖచ్చితంగా రైతులు విత్తనశుద్ధి చేసుకోవాలని పొదలకూరు వ్యవసాయ సహాయ సంచాలకులు శివనాయక్ అన్నారు. మంగళవారం వావింటపర్తి, దుగ్గుంట రాజుపాలెం గ్రామాల్లో నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆయన రైతులతో మాట్లాడారు. ర్యక్రమంలో ఉద్యానశాఖ అధికారి ఆనంద్, ఏఈవో జయలక్ష్మి, వీఏఏ శ్రీనివాసతేజ, అశ్విని, రైతు నాయకులు పెంచలనాయుడు, వెటర్నరీ సహాయకలు దివ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేటు వాహనాల్లో రేషన్ తరలింపు

న్యూస్‌టుడే, కోవూరు


గోదాం వద్ద ఆటోలో సరకులను తరలిస్తున్న డీలర్లు

నిబంధనలకు విరుద్ధంగా పలువురు చౌకదుకాణాల డీలర్లు ప్రైవేట్ వాహనాల్లో రేషన్ సరకులు తరలిచడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. మండలంలోని ఇనమడుగు పౌరసరఫరాల శాఖ గోదాముల నుంచి మంగళవారం డీలర్లు ఆటోల్లో రేషన్ సరకులు తీసుకెళ్లారు. సాధారణంగా ప్రతి నెలా చివరి వారంలో రేషన్ సరకులను డీలర్లు ఎంఎల్‌ఎస్ గోదాం వద్దకు వచ్చి ప్రభుత్వ వాహనాల్లో గ్రామాలకు తరలిస్తారు. ఈ నెలలో పాఠశాలల్లో విద్యార్థులకు మధ్యాహ్నభోజనం(ఎండీఎం), జిల్లా శిశు సంక్షేమశాఖ(ఐసీడీఎస్) పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాలకు సంబంధించిన బియ్యం, కందిపప్పు ఆలస్యంగా వచ్చాయి. ఇప్పటికే డీలర్లు గ్రామాల్లో ప్రజలకు రేషన్ సరకుల పంపిణీ దాదాపుగా పూర్తి చేశారు.

➜ ప్రస్తుతం రెండోసారి వచ్చిన సరకులను మాత్రం ప్రభుత్వ వాహనాల్లో చౌకదుకాణాలకు అధికారులు సరఫరా చేయడం లేదు. డీలర్లు వారి సొంత లేదా ప్రైవేటు వాహనాల్లో తరలిస్తున్నారు. రేషన్ సరకులు పక్కదారి పట్టే అవకాశాలు ఉండటంతో పాటు డీలర్లపై భారం పడుతుందని పలువురు వాపోతున్నారు. వర్షాలు తగ్గిన తరువాత చౌకదుకాణాలకు ప్రభుత్వ వాహనాల ద్వారా పంపిణీ చేయాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షులు కృష్ణారెడ్డి అధికారులను కోరారు. కోవూరు, కొడవలూరు, విడవలూరు, అల్లూరు మండలాలకు చెందిన పలువురు చౌకదుకాణాల డీలర్లు గోదాం వద్దకు వచ్చారు. కందిపప్పు తీసుకెళ్లినా కేంద్రాల్లో ఉంచి వచ్చే నెలలో రేసన్ సరకులతో కలిపి సరఫరా చేయాలని అధికారులు సూచించారు. దీనిపై గోదాం డీటీ బాలకోటమ్మ మాట్లాడుతూ.. ఈ నెలలో చౌకదుకాణాలకు అందించాల్సిన రేషన్ ఆలస్యంగా గోదాముకు రావడంతో డీలర్లు వారి ఆటోల్లో కేంద్రాలకు తీసుకెళుతున్నారన్నారు. ప్రైవేటు వాహనాల్లో సరకుల తరలించకుండా నిలిపేస్తామన్నారు.

వెంకటగిరి నియోజకవర్గ సమాచారం

చెంచులక్ష్మి కుటుంబీకులను ఆదుకుంటాం

రాపూరు, న్యూస్‌టుడే: రెండు రోజుల క్రితం మృతి చెందిన గిరిజన మహిళ చెంచులక్ష్మి కుటుంబీకులను అన్ని విధాలా ఆదుకుంటామని నెల్లూరు ఐటీడీఏ పీవో పరిమళ, తిరుపతి డీటీడబ్ల్యూవో సూర్యనారాయణ, డక్కిలి తహసీల్దార్ శ్రీనివాసులు పేర్కొన్నారు. మంగళవారం డక్కిలి మండలం దందోలు వెళ్లి వారి కుటుంబ సభ్యులను గిరిజన సంఘం నాయకులతో వెళ్లి పరామర్శించారు. జరిగిన ఘటనపై రవిని అడగి తెలుసుకున్నారు. ఆయన చెప్పిన వివరాలను రికార్డు చేశారు. సదరు వ్యాపారిపై చర్యలు తీసుకోవడంతో పాటు ప్రభుత్వ పరంగా తమను ఆదుకోవాలని బాధిత కుటుంబ సభ్యులు డిమాండ్ చేశారు. కలెక్టర్ ఆదేశాల మేరకు మృతురాలి కుటుంబ సభ్యులను ఆదుకుంటామని ఐటీడీఏ పీవో పరిమళ హామీ ఇచ్చారు.

ఆర్థిక స్వావలంబనతోనే మహిళాభివృద్ధి

సైదాపురం, న్యూస్‌టుడే: మహిళలు ఆర్థిక స్వావలంబనతో అభివృద్ధిని సాధించాలని వక్తలు పేర్కొన్నారు. మండల కేంద్రమైన సైదాపురం వెలుగు కార్యాలయంలో మంగళవారం అంతర్జాతీయ గ్రామీణ మహిళాదినోత్సవ సభను ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా మహిళలు ఆర్థికంగా అభివృద్ధిని సాధించేందుకు ప్రభుత్వం అందిస్తున్న వివిధ పథకాలపై వివరించారు. ఎంపీడీవో శివకుమార్, తహసీల్దారు రమాదేవి, డిప్యూటీ తహసీల్దారు అనూరాధ, ఏపీఎం చంద్రశేఖర్, వివిధ గ్రామాల పొదుపు మహిళలు పాల్గొన్నారు.

పంచాయతీ కార్యాలయానికి తాళం.. సమస్యలతో సతమతం


తెరుచుకోని పొదలకూరు పంచాయతీ భవనం

న్యూస్‌టుడే, పొదలకూరు

పొదలకూరు మేజర్ పంచాయతీలో అధికారులు ఇష్టారాజ్యంగా వ్యవహరించడంతో ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు.. సుమారుల 20 వేలకు పైగా జనాభా నివసిస్తున్నారు.. వివిధ ప్రాంతాలకు కూడలి కావడంతో నిత్యం రాకపోకలతో రద్దీగా ఉంటుంది.. ఎక్కడి చెత్త అక్కడ పేరుకుపోవడంతో వ్యాధులు ప్రబలుతున్నాయని స్థానికులు భయాందోళనకు గురవుతున్నారు.. జిల్లా వ్యాప్తంగా తుపాను ప్రభావంతో భారీ వర్షాలు కురుస్తున్నాయి... పారిశుద్ధ్య చర్యలతో పాటు ప్రత్యేక వసతులు కల్పించడంలో అధికారులు నిమగ్నమయ్యారు.. వారం రోజుల క్రితం అధికారులు పంచాయతీ కార్యాలయానికి తాళం వేయడంతో ప్రజల సమస్యలు పట్టించుకునే వారు లేరు.

☛ ఒకటో సచివాలయంలో నిర్వహిస్తున్న మేజరు పంచాయతీ కార్యాలయాన్ని ఎలాంటి అనుమతులు లేకుండా నూతనంగా నిర్మించిన భవనంలోకి మార్చారు. కీలక దస్త్రాలు అధికారుల సమక్షంలో మార్చకుండా ఇష్టారాజ్యంగా వ్యవహరించడంతో తెదేపా నాయకులు అభ్యంతరం తెలిపారు. పోలీసులకు ఫిర్యాదు చేయడంతో తాళాలు వేసి తహసీల్దారుకు అప్పగించారు. ☛ ప్రస్తుతం పంచాయతీ కార్యాలయంగా ఉపయోగించాలన్న నూతన భవనం రెండు దశాబ్దాల క్రితం వెలుగు ప్రాజెక్టు కార్యాలయ నిర్మాణానికి నిధులు మంజూరు చేశారు. భవనం పూర్తి కాకుండా అసంపూర్తిగా ఉంది. వైకాపా పాలనలో ఈ ఏడాది మార్చిలో కమ్యూనిటీ హాలుగా మార్చారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత పలు ప్రాంతాలుగా కూడలిగా ఉన్న పొదలకూరులో అన్న క్యాంటీన్ అవసరమని గుర్తించి జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. వైకాపాకు చెందిన పంచాయతీ పాలకవర్గ సభ్యులు అన్న క్యాంటీన్‌కు ఇష్టం లేక ఈనెల ఆరున ఒకటో సచివాలయంలో ఉన్న పంచాయతీ కార్యాలయంలోని దస్త్రాలను, సామాగ్రి, దస్త్రాలు నూతన భవనంలోకి చేర్చారు. ☛ నిబంధనలకు విరుద్ధంగా పంచాయతీ కార్యాలయాన్ని మార్చారని, కనీసం కార్యదర్శి లేకుండా కొన్ని దస్త్రాలు మాయం చేశారని ఆరోపిస్తూ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు పంచాయతీకి సంబంధించిన ఉన్నతాధికారులు సమస్య పరిష్కరించే వరకు ఎవరూ కార్యాలయం లోకి వెళ్లకుండా తాళాలు వేయించి తహసీల్దారుకు అప్పగించారు. వారం రోజులుగా కార్యాలయానికి సమస్యలు చెప్పేందుకు వస్తున్నా తాళం వేసి ఉండటంతో నిరాశగా వెళుతున్నారు. బస్టాండు వద్ద కుప్పలుగా పేరుకుపోయి దుర్వాసనతో స్థానికులు వ్యాధుల బారిన పడుతున్నామని వాపోతున్నారు. బస్టాండులో ప్రయాణికులు నరకయాతన పడుతున్నారు. పంచాయతీ పాలకవర్గంపై తీరుపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఉన్నతాధికారులు స్పందించి పారిశుద్ధ్యం, తాగునీరు ఇతర సమస్యలు పరిష్కారించాలని ప్రజలు కోరుతున్నారు.


సైడు కాలువల్లో పేరుకొన్న మురుగు

త్వరలో పరిష్కరిస్తాం

పంచాయతీ కార్యాలయ సమస్యను త్వరలో పరిష్కరిస్తాం. జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. కలువాయి ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించడం రెండు మండలాలను చూసుకొనే క్రమంలో జాప్యం జరిగింది. పారిశుద్ధ్యానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటాం. ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూస్తాం.

\- నరసింహారావు, ఎంపీడీవో

యువతిని మోసం చేసిన ఘటనపై కేసు

ఆత్మకూరు, న్యూస్‌టుడే: యువతిని ప్రేమించి.. పెళ్లి చేసుకుంటానని నమ్మించి.. మోసం యువకుడిపై మంగళవారం కేసునమోదు చేసినట్లు ఆత్మకూరు ఎస్సై జిలాని, సోమశిల ఎస్సై అనూష తెలిపారు. పోలీసుల వివరాల మేరకు... వారిద్దరు కొంత కాలంగా ప్రేమించుకుంటున్నారు. పెళ్లి చేసుకుంటానని యువకుడు నమ్మించి లోబరచుకున్నారు. సదరు యువకుడు వేరే యువతితో ఈనెల 21న వివాహం నిశ్చయమవడంతో బాధితురాలు గట్టిగా నిలదీసింది. మంగళవారం బయటకు తీసుకెళ్లి వివాహం చేసుకుంటానని యువతిని నమ్మించి ఫోన్ స్విచ్ఛాఫ్ చేసి పరారయ్యాడు. మోసపోయానని గుర్తించిన యువతి పోలీసులను ఆశ్రయించింది. యువకుడిపై పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేసి, కేసును దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

న్యాయం చేయాలని ఆవేదన

విడవలూరు, న్యూస్‌టుడే: తనను కాదని భర్త మరో వివాహానికి సిద్ధమవుతున్నారని భార్య ఆవేదన వ్యక్తం చేసింది. ఆమె మంగళవారం విడవలూరులో మాట్లాడుతూ.. బాధితురాలి వివరాల మేరకు ఆమెకు ఊటుకూరు శంకర్‌నగర్ కాలనీకి చెందిన గణేశ్‌తో ఏడేళ్ల క్రితం వివాహమైంది. సంతానం కలగకపోవడంతో భర్త తరచూ మద్యం తాగి వేధించారని వాపోయారు. భార్య ఆరు నెలల క్రితం దిశ స్టేషనులో భర్తపై ఫిర్యాదు చేసింది. పోలీసుల సూచనలతో స్థానిక స్టేషన్‌లో వారం రోజుల క్రితం ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో భర్త వేరొకరితో వివాహానికి సిద్ధమవుతున్నారని వాపోయింది. జిల్లా ఉన్నతాధికారులు స్పందించి తనకు న్యాయం చేయాలని కోరారు.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు

ఇందుకూరుపేట : ఇందుకూరుపేట ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో 18 మద్యం దుకాణాలకు అనుమతి ఇచ్చినట్లు ఆ శాఖ సీఐ ప్రసాద్‌రెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ ఇందుకూరుపేట మండలంలో అయిదు, తోటపల్లిగూడూరు మండలంలో అయిదు, ముత్తుకూరు మండలంలో ఎనిమిది దుకాణాలకు లైసెన్సుదారులు ఫీజులు చెల్లించినట్లు చెప్పారు. బుధవారం నుంచి అమ్మకాలకు అనుమతి ఇస్తున్నట్లు వివరించారు. నిబంధన ప్రకారం దుకాణాలను నిర్వహించాలని, వాటిని అతిక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

(c) eenadu

నెల్లూరు

•నెల్లూరు • నెల్లూరు గ్రామీణం



ట్రాఫిక్ కానిస్టేబుల్‌కు ఎస్పీ అభినందన

నగరంలో కురుస్తున్న భారీ వర్షాలకు ట్రాఫిక్ జామ్ అయింది. ముఖ్యంగా మంగళవారం కేవీఆర్ పెట్రోల్ బంక్ కూడలి వద్ద భారీస్థాయిలో వాహనాలు నిలిచిపోయాయి. ఈ క్రమంలో ట్రాఫిక్ కానిస్టేబుల్ అనిల్ వాహనాలు ఆగకుండా వర్షంలో తడుస్తూనే విధులు నిర్వర్తించారు. దీంతో ఎస్పీ జి.కృష్ణకాంత్ ఆయన్ని అభినందించారు. – న్యూస్‌టుడే, నెల్లూరు(నేర విభాగం)



అవగాహన కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న మెడికల్ హాస్పిటల్ సూపరింటెండెంట్ హరిప్రసాద్‌రెడ్డి

చేతుల శుభ్రతతో వ్యాధులు దూరం

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), న్యూస్‌టుడే: చేతులు శుభ్రంగా ఉంచుకోవడం ద్వారా విరేచనాలు, డయేరియా వంటి వాటి బారిన పడకుండా ఉండొచ్చని, పిల్లలకు ఇన్ఫెక్షన్ రాదని నారాయణ మెడికల్ కళాశాల సూపరింటెండెంట్ డాక్టర్ బి.హరిప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. గ్లోబల్ హ్యాండ్ వాష్ డే సందర్భంగా నెల్లూరు రూరల్ నారాయణ మెడికల్ కళాశాలలో మంగళవారం అవగాహన సదస్సు జరిగింది. ఆయన మాట్లాడుతూ.. జలుబు, శ్వాసకోశ సమస్యలు 20శాతం వరకు చేతుల శుభ్రతతో తగ్గించుకోవచ్చన్నారు. కార్యక్రమంలో నారాయణ హాస్పిటల్ అడిషనల్ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ ఆర్.హరీష్, డిప్యూటీ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ అరుణ్‌కాంత్, డాక్టర్ సతీష్ తదితరులు పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా!

(10 AM to 1 PM) నెల్లూరు, గ్రామీణం 80085 50332 80085 74001

సమస్య: చిన్నబజారు కామాటివీధిలో కాలువలు పూడికతో నిండిపోయి... మురుగునీరు ముందుకు కదలడం లేదు. – ఖలీద్

సమాధానం: కాలువల్లో పూడిక తీయిస్తాం.

– డాక్టర్ చైతన్య, ఆరోగ్యాధికారి

? వాకర్స్‌రోడ్డులో పశువులు గుంపులుగా చేరుతున్నాయి. రాత్రిపూట కన్పించక ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. – నరేంద్రరెడ్డి

✓ సిబ్బంది ద్వారా పశువులను గోశాలకు తరలించేందుకు చర్యలు చేపడతాం.

– డాక్టర్ మదన్‌మోహన్, వెటర్నరీ అధికారి

? మైపాడు రోడ్డు నాలుగో మైలు బృందావనం గార్డెన్స్ 4వ అడ్డరోడ్డులో ఖాళీ ప్లాట్లు పిచ్చి మొక్కలతో నిండిపోయి విషపురుగులకు ఆవాసంగా ఉన్నాయి. – నజీర్‌బాషా

✓ఖాళీప్లాట్ల యజమానులకు నోటీసులు ఇచ్చి చర్యలు తీసుకుంటాం. –సూర్యతేజ, కమిషనర్

– న్యూస్‌టుడే, నెల్లూరు(టౌన్, నవాబుపేట)

వీడని వర్షం

శివారు కాలనీల్లో నిలిచిన నీరు ● రహదారులు జలమయం



వర్షంలో వాహనదారుల అవస్థలు

నెల్లూరు(నగరపాలక సంస్థ), న్యూస్‌టుడే: ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు నెల్లూరు నగర, శివారు ప్రాంతాల వాసులు విలవిల్లాడుతున్నారు. పల్లపు ప్రాంతాలు జలమయమయ్యాయి. రెండు రోజులుగా భారీ వర్షం కురుస్తుండటంతో శివారు ప్రాంతాలైన [illegible] ఆర్టీసీ కాలనీ, బుజబుజనెల్లూరు, పోలీసు కాలనీ, రెవెన్యూ కాలనీ, [illegible] కమ్మ సంఘం, సుందరయ్యకాలనీ, భగత్‌సింగ్‌కాలనీ తదితర ప్రాంతాల్లో నీరు చేరింది. శివారు ప్రాంతాల్లోని కాలనీల్లో దాదాపు 4 లక్షల మంది వరకు జనాభా నివాసం ఉంటున్నారు. కాలనీల్లో సరైన డ్రైనేజీ వ్యవస్థ లేక జనావాసాల మధ్య మురుగునీరు నిలుస్తోంది. కాలనీల్లో మురుగునీటి వ్యవస్థ లేకపోవడంతో నివాసాల నుంచి వచ్చే వ్యర్థ జలాలన్నీ ఖాళీ స్థలాల్లోనే నిలిచి పోతున్నాయి. ఏటా వర్షాకాలంలో శివారు కాలనీలు ముంపునకు గురవుతున్నా.. అధికారులు, ప్రజాప్రతినిధులు శాశ్వత పరిష్కారం చూపడం లేదు.



ఆటోనగర్ వెంట తల్పగిరి కాలనీలో వర్షపు నీటి నిల్వ



తల్పగిరి కాలనీలో రోడ్డుపైకి చేరిన వర్షపు నీరు

రాకపోకలకు అవస్థలే..

నెల్లూరు(జెడ్పీ), న్యూస్‌టుడే: రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు నెల్లూరు, గ్రామీణ పరిధిలోని పలు రోడ్లు జలమయమయ్యాయి. ఆచారివీధి పరిధిలో, మాగుంట లేఅవుట్, కె.వి.ఆర్. పెట్రోలు బంకు నుంచి దర్గామిట్ట వెళ్లే మార్గం, జిల్లా పోలీసు కార్యాలయం రోడ్డు, జిల్లా పరిషత్ కార్యాలయం వెళ్లే మార్గం ఇలా వివిధ ప్రాంతాల్లో నీరు నిలిచి నగరవాసులు, ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు.



మాగుంటలేఅవుట్ ప్రధాన మార్గంలో..



ఆచారివీధి పరిధిలో చెరువులా..

నీటి ప్రవాహానికి ఆటంకం

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), న్యూస్‌టుడే: నగరంలోని సుబేదారుపేట ట్రంకు రోడ్డు ప్రధాన మార్గం కావడంతో నిత్యం భారీ సంఖ్యలో వాహనాల రాకపోకలతో రద్దీగా ఉంటుంది. రోడ్డుకు సుబేదారుపేట వైపు పైడు కాలువ ఉండగా.. చెత్త చెదారాలు, ప్లాస్టిక్ వ్యర్థాలతో నీరు ముందుకు కదలడం లేదు. దుకాణాల ముందు యజమానులు కాలువపై శ్లాబు వేయడం, గతంలో విద్యుత్తు స్తంభాలు ఉన్నప్పటికీ గుత్తేదారు నిర్మాణాలు చేపడుతుండడంతో నీరు ముందుకు కదలని పరిస్థితి.



కనకమహల్ కూడలిలో..

అభివృద్ధి పనులకు శ్రీకారం

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), న్యూస్‌టుడే: నెల్లూరు రూరల్ నియోజకవర్గం ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పనిచేయడమే అజెండా అని తెదేపా నాయకుడు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి పేర్కొన్నారు. నెల్లూరు రూరల్ మండలం దేవరపాలెంలో రూ.10 లక్షల నిధులతో కాలువ పనులకు మంగళవారం ఆయన శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో శైలేంద్రబాబు, నాయకులు ఇందుపూరు శ్రీనివాసులురెడ్డి, ఎంపీపీ బూడిద విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



అభివృద్ధి పనుల శిలాఫలకం ఆవిష్కరిస్తున్న కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి

పునరావాస కేంద్రాల్లో ఏర్పాట్లు పూర్తి చేయండి

నెల్లూరు(నగరపాలకసంస్థ), న్యూస్‌టుడే: భారీ వర్షాలకు లోతట్టు ప్రాంతాల్లో ఉన్న ప్రజలు ఇబ్బంది పడకుండా నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో 13 పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేశామని, బాధిత ప్రజలకు అన్ని సదుపాయాలు కల్పించేందుకు సిద్ధంగా ఉన్నామని కమిషనర్ సూర్యతేజ తెలిపారు. మంగళవారం అన్ని విభాగాల అధికారులతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రెవెన్యూ విభాగం ఆధ్వర్యంలో పునరావాస కేంద్రాల్లో ప్రజలకు తాగునీరు, విద్యుత్తు సౌకర్యం, ఫ్యాన్లు, పారిశుద్ధ్యం తదితర సదుపాయాలను కల్పించి అవసరమైన అన్ని చర్యలను ప్రణాళికాబద్ధంగా చేపట్టాలని సూచించారు. నగరవ్యాప్తంగా జరుగుతున్న కాలువల పూడికతీత పనులను వేగవంతం చేయాలన్నారు. ప్రచారం కోసం వినియోగిస్తున్న ఫ్లెక్సీలు, పోస్టర్లు ఇతర హోర్డింగులను గుర్తించి వెంటనే తొలగించాలని తెలిపారు.



చెట్ల కొమ్మలు తొలగించడాన్ని పరిశీలిస్తున్న కమిషనర్ సూర్యతేజ

తెదేపా నేతలకే మద్యం దుకాణాలు: కాకాణి

నెల్లూరు(నగరపాలకసంస్థ), న్యూస్‌టుడే: లాటరీ విధానంలో 90 శాతం మద్యం దుకాణాలు తెదేపా నేతలకే దక్కాయని, ఎమ్మెల్యేల కనుసన్నల్లోనే లాటరీ ప్రక్రియ సాగిందని వైకాపా జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి అన్నారు. మంగళవారం నెల్లూరులోని పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు.

In the Court of the II Additional Senior Civil Judge, Nellore.

E.P. No. 25 / 2023

O.S. No. 55 / 2015

Chandra Subrahmanyam - D.H.R./ Plaintiff

Vs.

1. Pachava Vasavi
2. Pachava Deepak
3. Pachava Vengamma

- J.D.Rs/ Defendants

వేలం ప్రకటన

పై నెంబరున డిక్రీహోల్డర్ డిక్రీ బాకీ రాబట్టుకొనుటకు జె.డి.ఆర్స్ తాలూకు ఈ క్రింది షెడ్యూలు దాఖలా స్థిరాస్తిని తే:07-11-2024దిన ఉదయం 10.30 గంటల నుండి సాయంత్రం 5 గంటల లోపల పై తెలిపిన కోర్టులో బహిరంగ వేలంపాట జరుపబడును. కావున పాటదారులు ఎవ్వరైనా వేలంపాటలో పాల్గొని పాట పాడుకొనవచ్చును.

SCHEDULE

SPSR Nellore District, Stonehousepet Sub- Registration - Nellore Rural Mandal - Navalakulathota Village- Allipuram Majara - Sy. No. 212/1 Ac. 0.18 cents - Sy. No. 211/1 Ac. 0.24 cents, Total Ac. 0.42 cents - plan approved under name "Srinivasa Nagar" - Plot No. 31 an extent of 33.24 ankanams out of this South side 16.66 ankanams following boundaries as follows : **East:** Plot No. 36, **West:** 30" feet road, **North:** Land of Ajaykumar reddy, **South:** Plot No. 30 with all easementary rights.

within following boundaries an extent of 16.66 ankanams the deceased having share in his favour 8.33 ankanams undivided share (1/2 of share in the document No. 367/2011)

DHR Value Rs. 50,000/-
Amin Value Rs. 8,33,000/-
Market Value Rs. 3,99,990/-

వేమన గోపి, B.Com., L.L.B.,
జె.శ్రీనివాసులు, B.Com., L.L.B.,
డిక్రీహోల్డరు తరపు అడ్వకేట్స్, నెల్లూరు.

స్థానికులే రక్షణ చర్యలు



నెల్లూరు నగరం వేదాయపాళెం నుంచి బీవీనగర్‌కు వెళ్లే మార్గంలో మ్యాన్‌హోల్ గుంతలో వర్షపునీరు చేరడంతో ద్విచక్ర వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. స్థానికులు గుంతలో కర్రను పెట్టి ప్లాస్టిక్ కవర్లను తగిలించి ప్రమాదాలు జరగకుండా చూస్తున్నారు. రక్షణ చర్యలు చేపడతామని నగరపాలక ఇంజినీరింగ్ అధికారులు తెలిపారు. – న్యూస్‌టుడే, నెల్లూరు(టౌన్)

భారీ వాహనాలతో ప్రమాదమే..

నెల్లూరులో శెట్టిగుంట వద్ద పాత పెన్నా వంతెన వర్షానికి కోతకు గురైంది. వంతెనపై దాదాపుగా 30 టన్నుల ఇసుకను తీసుకెళ్తున్న టిప్పర్లు తిరుగుతున్నాయి. అవి వెళ్లే సమయంలో బ్రిడ్జి ఊగుతోందని స్థానికులు చెబుతున్నారు. పగటిపూటే పెద్ద ఎత్తున లారీలు రాకపోకలు సాగిస్తున్నాయని తెలిపారు. నిబంధనల ప్రకారం పగటివేళ భారీ లోడుతో ఉన్న లారీలు నగరంలోకి అనుమతించకూడదు. అయినా తిరుగుతున్నాయని నగరవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. –ఈనాడు, నెల్లూరు



కుంగినా అధికారులకు పట్టదా?



నెల్లూరు నగరంలోని పాత జిల్లా జైలు రోడ్డు సమీపంలో ఇరిగేషన్ కాలువపై ఉన్న వంతెన ప్రమాదకరంగా మారింది. కొంత భాగం లోపలకు ఒరిగిపోయింది. పైభాగం పగుళ్లిస్తోంది. రాకపోకలు సాగించే ప్రయాణికులు ఆందోళన చెందుతున్నారు. అధికారులు చర్యలు తీసుకుని వంతెనకు శాశ్వత మరమ్మతులు చేయాలని నగరవాసులు కోరుతున్నారు. ఈ విషయంపై కార్పొరేషన్ ఇంజినీరింగ్ అధికారులను సంప్రదించగా ఇరిగేషన్ అధికారులతో చర్చించి చర్యలు తీసుకుంటామన్నారు. – న్యూస్‌టుడే, నెల్లూరు(దర్గామిట్ట)

వ్యాసరచన పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

నెల్లూరు(విద్య), న్యూస్‌టుడే: వారధి ఫౌండేషన్ వారు రాష్ట్రస్థాయిలో ఆన్‌లైన్ ద్వారా నిర్వహించిన వ్యాసరచన, చర్చా వేదిక పోటీల్లో జిల్లా విద్యార్థులు ప్రతిభ చాటారు. విద్యార్థులను జిల్లా విద్యాశాఖాధికారి పీవీజే రామారావు, సమగ్రశిక్షా అభియాన్ ఏపీసీ సీహెచ్ ఉషారాణి అభినందించారు. సర్వేపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని బి.సంయుక్త వ్యాసరచన పోటీల్లో ద్వితీయస్థానంలో నిలిచిందని, పొదలకూరు జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల విద్యార్థులు సుమన్‌సాయి, చరిత, తేజస్విని, సృజన కన్సొలేషన్ బహుమతులు సాధించారని తెలిపారు.

యుద్ధప్రాతిపదికన చర్యలు

నెల్లూరు(నగరపాలకసంస్థ), న్యూస్‌టుడే: నెల్లూరు నగరంలో రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు నగరపాలకసంస్థ అధికారులు అప్రమత్తమయ్యారు. కమిషనర్ సూర్యతేజ నిరంతరం పర్యవేక్షిస్తూ యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టాలని ఆదేశాలు జారీ చేశారు. ఇంజినీరింగ్ అధికారులు ఆత్మకూరు బస్టాండు, రామలింగాపురం, మాగుంట లేఅవుట్, విజయమహల్ గేటు వద్ద వాహనచోదకులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా వర్షపునీటిని మోటార్ల సహాయంతో తొలగిస్తున్నారు. మాగుంట లేఅవుట్ వద్ద పైపుల్లో మట్టిపేరుకుపోయి వర్షపునీటి ప్రవాహానికి ఆటంకం ఏర్పడింది. మిషన్ పవర్ సహాయంతో మట్టిని తొలగించారు. 53వ డివిజన్ గాంధీ గిరిజనకాలనీ, వెంకటేశ్వరపురం ప్రాంతాల్లో వర్షపునీటిని మోటార్ల సహాయంతో తొలగించారు. 25వ డివిజన్ ఆర్టీసీ కాలనీలో జేసీబీతో వర్షపునీటి కచ్చా కాలువల తొలగించారు. పొగతోటలో కాలువలపై ఉన్న సిమెంటు పలకలను జేసీబీ బ్రేకర్ల ద్వారా తొలగించి కాలువల్లో పూడిక తీత పనులను చేపట్టారు. మన్సూర్ నగర్, శివాజీనగర్ ప్రాంతాల్లో తాత్కాలిక ఆక్రమణలు తొలగించారు. విజయమహల్‌గేటు వద్ద ఉన్న బాక్స్‌టైపు బ్రిడ్జిలో వర్షపునీటిని మోటార్ల ద్వారా తోడి వాహనదారులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకున్నారు.





మోటారు సాయంతో నీటిని తొలగిస్తున్న ఇంజినీరింగ్ అధికారులు.. పొగతోటలో బ్రేకర్ల ద్వారా సిమెంటు పలకల తొలగిస్తున్న సిబ్బంది

దుర్గమ్మకు నృత్య నీరాజనం



ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే : దసరా శరన్నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకొని విజయవాడ ఇంద్రకీలాద్రిపై కొలువైన జగన్మాత దుర్గమ్మకు నృత్య నీరాజనం చేయాలనుకున్న నెల్లూరుకు చెందిన భరత నాట్య కళాకారిణి భవ్యహాసిని ఆకాంక్ష మంగళవారం తీరింది. వేకువజామున కొండ చుట్టూ 8.01 కిలో మీటర్లు భరత నాట్యం చేస్తూ ఆమె గిరిప్రదక్షిణ పూర్తి చేశారు.

SBI స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

స్ట్రెస్డ్ అసెట్స్ రికవరీ బ్రాంచి,

డోర్ నెం. 54-20-1B/3F/U6, 3వ అంతస్తు, కెఫిసి మేడమీద, సూర్యప్రకాష్ స్క్వేర్, గురునానక్ నగర్ రోడ్డు, విజయవాడ-520008, ఎన్.టి.ఆర్.జిల్లా, ఆంధ్రప్రదేశ్. ఫోన్: 0866-2546922. ఇ-మెయిల్ : sbi.64267@sbi.co.in

ఇ-వేలం ద్వారా వాహనము అమ్మకం

1) ఋణగ్రహీత పేరు : శ్రీ పిడుగు గోపి, తండ్రి పి. కాటయ్య, 2-21, బ్రహ్మణపల్లి గ్రామము & పోస్ట్, కె వి బి పురం మండలం, తిరుపతి - 517 643.

క్ర. సం.	వాహనము నెం.	కంపెనీ / ఫ్యూయల్	మోడల్ / కలర్	కనీసపు ధర	ధరావత్తు
1	AP39UJ7670	EICHER 6016 N CWC BS6 OMNIBUS / DIESEL	2022/ Saloon/Blue and White	Rs. 21,00,000/-	Rs. 2,10,000/-
2	AP39UJ7671	EICHER 6016 N CWC BS6 OMNIBUS / DIESEL	2022/ Saloon/Blue and White	Rs. 21,00,000/-	Rs. 2,10,000/-

2) ఋణగ్రహీత పేరు : శ్రీ జగడం హరి బాబు, తండ్రి జగడం సుబ్రహ్మణ్యం, 3-133, కర్లపూడి గ్రామము, కొవ్వూరు పోస్ట్, కె వి బి పురం మండలం, తిరుపతి - 517 643.

క్ర. సం.	వాహనము నెం.	కంపెనీ / ఫ్యూయల్	మోడల్ / కలర్	కనీసపు ధర	ధరావత్తు
1	AP39UK 2473	EICHER 6016 N CWC BS6 OMNIBUS / DIESEL	2022/ Saloon/Blue and White	Rs. 21,00,000/-	Rs. 2,10,000/-
2	AP39UK 2474	EICHER 6016 N CWC BS6 OMNIBUS / DIESEL	2022/ Saloon/Blue and White	Rs. 21,00,000/-	Rs. 2,10,000/-

ఇ-వేలం తేది మరియు సమయం : 06-11-2024, ఉ॥ 11.00 గం॥ల నుండి సా॥ 04-00 గం॥ల వరకు

బిడ్ పెంపుదల : బిడ్డర్స్ వారి ఆఫర్ ధరలను రూ. 10,000/-లతో గుణింపులో హెచ్చించవలెను.

నియమ నిబంధనలు : 1) వాహనమును "ఎక్కడ ఎలా వున్నది అక్కడ అలానే" మరియు "అక్కడ ఏమున్నదో అదే" అను పద్ధతిలో వేలం వేయబడును. 2) రిజర్వు ధరకన్నా తక్కువ ధరకు వాహనము అమ్మబడదు. 3) విజయవంతమైన పాటదారుడు అంగీకరించిన అమ్మకపు ధరలో కనీసం (10+15) 25% తక్షణమే చెల్లించవలెను. మిగిలిన సొమ్మును 15 రోజులలోపు చెల్లించని పక్షంలో ఎటువంటి నోటీసు లేకుండా అప్పటి వరకు చెల్లించిన మొత్తమును కోల్పోవుదురు. 4) ఐడెంటిఫికేషన్ రుజువు (కెవైసి) అనగా స్వయం ధృవీకతతో ఆధార్ కార్డు/ఓటరు ఐడి కార్డు/డ్రైవింగ్ లైసెన్స్/పాస్‌పోర్ట్ వగైరా కాపీ జతపరచవలెను. ఇవి లేనిచో బిడ్డు తిరస్కరణకు గురికాగలదు. 5) ఎటువంటి కారణం చూపకుండానే వేలం వాయిదా వేయుటకు, రద్దు చేయుటకు బ్యాంకు వారికి అధికారం కలదు. 6) తేది. 16-10-2024 నుండి 05-11-2024 వరకు బ్యాంక్ పనివేళలలో వాహనమును తనిఖీ చేసుకోగలరు. వాహనము తనిఖీ కొరకు సంప్రదించవలసిన నెంబర్లు : 99204 59242 & 89784 80704. 7) అమ్మకం యొక్క సవివరమైన నియమ నిబంధనల కొరకు, సెక్యూర్డ్ క్రెడిటార్స్ అయిన స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా యొక్క వెబ్‌సైట్ : www.sbi.co.in/web/sbi-in-the-news/auction-noticesలో ఏర్పాటుచేసిన లింక్‌ను రిఫర్ చేయండి. రిజిస్ట్రేషన్, ఐయండి, వేలం యొక్క వివరములు మొదలగు వాటి గురించి సర్వీసు ప్రొవైడరు మెస్సర్స్ పిఎస్‌బి ఎలియన్స్, ఇ-ఆక్షన్ పోర్టల్ : https://ebkray.in/eauction-psb/bidder & https://ebkray.in టోల్ ఫ్రీ ఫోన్ నెం.: +91 - 8291220220, ఇ-మెయిల్ : support.ebkray@psballiance.com ను సంప్రదించండి.

తేది : 15-10-2024, ప్రదేశం : విజయవాడ సం/- అధీకృత అధికారి, SBI, SARB, విజయవాడ

సీసీఎస్ ఇన్‌స్పెక్టర్‌గా రాములు నాయక్

నెల్లూరు(నేర విభాగం), న్యూస్‌టుడే: సీసీఎస్ ఇన్‌స్పెక్టర్‌గా రాములు నాయక్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఆయన ఎస్పీ జి.కృష్ణకాంత్, అదనపు ఎస్పీని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈయన గతంలో నార్త్ ట్రాఫిక్, బాలాజీనగర్, సంతపేట ఇన్‌స్పెక్టర్లుగా పనిచేశారు. ప్రస్తుతం గుంటూరు రేంజ్ కార్యాలయంలో ఉంటూ బదిలీపై నెల్లూరుకు వచ్చారు.

ఆకలి తీరాలంటే.. అన్వేషణ తప్పదు..



నెల్లూరు నగరంలో రెండు రోజులుగా వర్షాలు పడుతున్నాయి. వానొస్తుందని ఇంట్లో కూర్చుంటే కొందరికే జరుగుబాటు అవుతుంది. పేదల పరిస్థితి అలా కాదు.. జానెడు పొట్ట నిండాలంటే ఏదో ఒక పనిచేయక తప్పదు. అందుకే ఓ యువకుడు రోడ్డుపై, కాలువ ప్రాంతాల్లో ఉన్న ప్లాస్టిక్ వ్యర్థాలు ఇలా ఏరుకుంటున్నాడు. వాటిని అమ్మి వచ్చే డబ్బుతో ఆకలి తీర్చుకుంటానంటున్నాడు. – న్యూస్‌టుడే, నెల్లూరు(బృందావనం)

రోడ్డు ప్రమాద మృతుడి గుర్తింపు

నెల్లూరు(నేర విభాగం), న్యూస్‌టుడే: నెల్లూరు గ్రామీణంలోని ధనలక్ష్మీపురంలో రెండు రోజుల క్రితం జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన వ్యక్తి రియాజ్(50)గా పోలీసులు గుర్తించారు. శుక్రవారం ధనలక్ష్మీపురం వద్ద రోడ్డు దాటుతుండగా గుర్తుతెలియని వాహనం ఢీకొంది. ప్రమాదంలో ఆయన అక్కడికక్కడే మృతి చెందారు. మృతుని వద్ద ఎలాంటి ఆధారాలు లేవు. అయితే గూడూరు పట్టణం మాయబజారుకు చెందిన రియాజ్‌గా మంగళవారం గుర్తించారు.

పడకేసిన పారిశుద్ధ్యం



చిన్నబజారులో నిండిపోయిన చెత్తడబ్బా

న్యూస్‌టుడే, నెల్లూరు(నగరపాలకసంస్థ)

నెల్లూరు నగరంలో ఓ వైపు ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తున్నాయి.. మరోవైపు నగరపాలక సంస్థ ఆరోగ్య విభాగం నిర్లక్ష్యం కారణంగా పారిశుద్ధ్యం పడకేసింది. నగరంలో ఎక్కడిచెత్త అక్కడే పేరుకుపోయింది. వర్షానికి తడిచి కుళ్లి వాసనొస్తోంది. మురుగునీరు ముంచెత్తడంతో జనం భయాందోళన చెందుతున్నారు.

గుట్టలుగా చెత్త

నెల్లూరు నగరంలోని 54 డివిజన్లలో సుమారు 9 లక్షల మంది జనాభా నివాసం ఉంటున్నారు. ప్రతిరోజూ 320 మెట్రిక్ టన్నుల చెత్త ఉత్పత్తి అవుతోంది. వాటిని తొలగించేందుకు 1500 మంది వరకు సిబ్బంది, వాహనాలు ఉన్నా.. ఆరోగ్య విభాగం అధికారుల నిర్లక్ష్యం కారణంగా గుట్టలుగా పేరుకుపోయింది. డస్ట్‌బిన్లు నిండిపోయి రోడ్డంతా పరచుకుంది. వర్షానికి తడవడంతో దుర్గంధం వస్తోంది. వ్యర్థాలను పందులు, పశువులు కలియబెడుతుండటంతో వ్యాధులు ప్రబలుతాయని నగరవాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

పూడికతో కాలువలు

నగరంలో మురుగునీటి పారుదల వ్యవస్థ అస్తవ్యస్తంగా మారింది. వ్యర్థాలు, కాలువలు శుభ్రం చేయకపోవడంతో వృథా నీరు ముందుకు పారే దారులు కనిపించడం లేదు. ఫలితంగా చిన్నపాటి వర్షాలకు నీరు నిలిచి వీధులు చెరువులను తలపిస్తున్నాయి. మురుగునీటి కాలువలు పూడికతీతకు నోచుకోలేదు. మురుగునీటితో పాటు వ్యర్థాలు, బురద ఇళ్లలోకి వస్తున్నాయి. కోటమిట్ట, ఏసీసెంటర్, కంసాలివీధి, సండే మార్కెట్, గాంధీబొమ్మ సెంటరుతో పాటు పలు ప్రాంతాల్లో కాలువలు పొంగి పొర్లుతున్నాయి. పారిశుద్ధ్య విభాగం నిర్వాకం వల్లే ఈ దుస్థితి నెలకొందని నగరవాసులు వాపోతున్నారు.



కోటమిట్టలో కాలువలు పొంగి వీధిలో చేరిన మురుగునీరు

తెరపై ఈనాడు



ఎం-1 సినిమాస్- స్క్రీన్1.. వెట్టయ్యాన్, స్క్రీన్-2.. దేవర, స్క్రీన్3.. విశ్వం, మార్టిన్, స్పైస్‌సినిమాస్(ఎంజీబీ మాల్)- స్క్రీన్1.. విశ్వం, స్క్రీన్2.. మార్టిన్, స్క్రీన్3..మానాన్న సూపర్ హీరో, జిగ్రా, విక్కీ విద్యాకా వోవాలా వీడియో, స్క్రీన్4..వెట్టయ్యాన్, స్క్రీన్5..దేవర, **రెయిన్‌సినిమాస్**-స్క్రీన్1..దేవర, స్క్రీన్2..విశ్వం,మార్టిన్, స్క్రీన్3..వెట్టియ్యాన్, స్క్రీన్4..మానాన్న సూపర్ హీరో, జిగ్రా, మార్టిన్, **సిరిమల్టీప్లెక్స్**..స్క్రీన్1..దేవర, స్క్రీన్2.. విశ్వం, వెటయ్యాన్, స్క్రీన్3.. విశ్వం, స్క్రీన్4.. జనక అయితే గనక

ఉత్తరక్రియలు



మా తండ్రి గారైన
అంబటి మాలకొండయ్య గారు
తేది 05-10-2024 శనివారం సాయంత్రం స్వర్గస్తులైనారు.
తేది : 17-10-2024 గురువారము పెద్దకర్మ
నెల్లూరు, శెట్టిగుంటరోడ్, నాగేంద్రనగర్‌లోని
మా స్వగృహము నందు జరుగును.
కావున తెలియజేయడమైనది.

ఇట్లు : కుమారుడు
అంబటి మాల్యాద్రి
మరియు కుటుంబ సభ్యులు
సెల్ : 98661 88899